
ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా
The Bombay Andhra Mahasabha & Gymkhana

ఫిబ్రవరి 2010

తెలుగు భాషా, సాహితీ, సంస్కృతి, కళల, క్రీడల వార్తా విశేషాల ..

# దర్పణం



# జరగబోయే కార్యక్రమాలు COMING EVENTS

**19-2-2010, శుక్రవారము సాయత్రం 7.00 గంటలకు**



రసరంజని సమర్పించు గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' నాటిక ప్రదర్శన
మరియు కుమారి ప్రహర్షిత గారి కూచిపూడి నృత్య ప్రదర్శన.

**19-2-2010, Friday, Evening 7.00 pm:**
Rasaranjani Presents, Telugu Drama "KANYASHULKAMU" written by **Late Sri. Gurajada Appa Rao** also Kuchipudi Dance by **Kum. K.L. PRAHARSHITA**

**20-2-2010, శనివారము, సాయంత్రం 7.00 గంటలకు**


రసరంజని సమర్పించు నాటిక 'మరో మొహంజదారో' ముఖ్య అతిథి : డా॥ కె.వి. రమణాచారి IAS



**20-2-2010, Saturday, Evening 7.00 pm :**
Rasaranjani presents, Telugu Drama "MARO MOHANJAODARO" Written by Late **Sri. N.R. Naudi** Chief Guest : **Dr. K.V. Ramanachari, IAS**


**21-2-2010, ఆదివారము ఉదయం 9.30 గంటలకు**

శ్రీ వేంకటేశ్వర పూజ మందిర్ ట్రస్టు తరఫున 'శ్రీ సత్యనారాయణ వ్రతము' మరియు 'శ్రీ విష్ణు సహస్ర నామార్చన'



**21-2-2010, Sunday, Morning 9.30 am :**
SRI SATYANARAYANA VRATAM & SRI VISHNU SAHASRA NAMARCHANA
by Sri Venkateshwara Pooja Mandir Trust.

**28-2-2010, సోమవారము, మ॥ 3.00 నుండి 5.00 గంటల వరకు**



మహిళాశాఖ అధ్వర్యంలో 'త్యాగరాజ స్వరాంజలి'

ఈ కార్యక్రమంలో పాల్గొన దల్చిన వారు, పాడగల్గిన వారు తేది ఫిబ్రవరి 24 లోపు, మహిళా శాఖ సభ్యులకు సంప్రదించగలరు

**28-2-2010, Sunday, 3.00 pm to 5.00 pm :**
"TYAGARAJA SWARANJALI" by Mahilashakha

**8-3-2010, సోమవారము, మ॥ 1.00 నుండి 4.00 గంటల వరకు**



మహిళాశాఖ అధ్వర్యంలో 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'

**8-3-2010, Monday, 1.00 pm to 4.00 pm :**
INTERNATIONAL WOMEN'S DAY by Mahilashakha

**16-3-2010, మంగళవారము సా॥ 6.00 గంటలకు**

వికృతి నామ సంవత్సర 'ఉగాది' వేడుకలు విశేష అతిథి, ప్రముఖ కవి, సినీగేయ రచయిత 'శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు'

అధిక వివరాలు వచ్చేనెల 'దర్పణం'లో చదవండి




**16-3-2010, Tuesday, Eve. 6.00 pm onwards :**
'UGADI VEDUKALU' Special Guest : Eminent Poet and Lyricist **Sri. Jonnavittula**
*(Details will be published in next Darpanam)*

# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

# The Bombay Andhra Mahasabha & Gymkhana


10-C, Lakhamsi Napoo Road, Dadar (E), Mumbai - 400014. Tel. 24144377 / 24144388, Fax: 24119832.

## మా మాట

సభ్యులందరికీ నమస్కారం..!

ముందుగా, రానున్న 'అంతర్జాతీయ మహిళాదినోత్సవ' సందర్భంగా మహాసభ మహిళాసభ్యులందరితో పాటు యావత్ మహిళామణులందరికీ హార్దిక శుభాకాంక్షలు అందిస్తున్నాం. ఈ దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇప్పటికే వివిధ రంగాల్లో తమ ప్రతిభను చూపుతున్న మహిళలందరూ ముమ్ముందు మరింత ఉత్సాహంతో అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలనీ, ఈ పురుషాధిక్య సమాజంలో తమ ప్రాధాన్యతను మరింతా నిరూపించుకోవాలనీ ఆకాంక్షిస్తున్నాం.

ఎప్పట్లాగే "దర్పణం" పట్ల మీరు చూపిస్తున్న ఆదరణకు మేము ఆనందిస్తున్నాం. మరిన్ని ప్రత్యేక శీర్షికలతో దర్పణాన్ని తీర్చిదిద్దేందుకు మేము ప్రయత్నిస్తున్నాం.

ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సూరజ్ వాటర్ పార్క్' విహార యాత్రకు అనూహ్య స్పందన లభించడం మాకు అమితానందాన్ని ఇచ్చింది. ఎన్నడూ లేని విధంగా ఈ సారి సభ్యులందరూ అత్యధిక సంఖ్యలో విహార యాత్రలో పాల్గొనడం మాకు ఆశ్చర్యానందాల్ని కలగచేసింది. ముమ్ముందు కూడా మహాసభ నిర్వహించే కార్యక్రమాల్లో సభ్యులు ఇలాగే భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం.

గణతంత్రదినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్న విద్యార్థినీ విద్యార్థులకు మా అభినందనలు. మిగతా విద్యార్థులు కూడా ఏ మాత్రం నిరాశకు గురికాకుండా మరింత పట్టుదలతో ప్రయత్నించి ముమ్ముందు అగ్రస్థానం సంపాదించుకోవాలని కోరుతున్నాం.

ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రాంతీయ భాషలు విలవిలలాడుతున్న విషయం విదితమే. ఆ భాషల్లో తెలుగు కూడా ఉందనే విషయాన్ని ప్రత్యేకంగా ఉటంకించాల్సిన అవసరం లేదు. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకై మహాసభ ఎల్లవేళలా ముందుంటుందన్న విషయం కూడా మీ అందరికీ విదితమే. అందుకే త్వరలోనే తెలుగు భాషావికాసాలకై ఒక గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అందుకు మీ అందరి సహకారం అనివార్యం కాబట్టి ఆపేక్షిస్తున్నాం.

మరొక్కమాట.. మహాసభలో అమూల్యమైన గ్రంథాల ఖజానా ఉంది. దాన్ని సభ్యులందరూ పూర్తిగా వినియోగించుకోవాలనీ కోరుతున్నాం. అంతేకాకుండా క్రీడా పోటీలు కూడా నిర్వహిస్తున్నాం. వీటిలో యువకులు, యువతులు పెద్ద సంఖ్యలోపాల్గొని ముంబై క్రీడా రంగంలో తెలుగుకేతనాన్ని ఎగరవేసే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం.

ఇటీవలే భారతప్రభుత్వం నుండి 'పద్మ' అవార్డులు అందుకున్న తెలుగువారందరికీ సగర్వాభినందనలు తెలియచేస్తున్నాం. తెలుగు వారు రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా విశిష్ట గౌరవాన్ని అందుకునేస్థాయికి ఎదగాలనీ మనసారా కాంక్షిస్తున్నాం.

దర్పణానికి రచనలు పంపాలనీ, సభాకార్యక్రమాల్లో సభ్యులందరూ ఆసక్తిగా పాల్గొనాలని మీ అందరిని కోరుతూ ప్రస్తుతానికి సెలవు తీసుకుంటున్నాం.

**డా॥ జి. హరికిషన్**
(అధ్యక్షుడు)



**భోగ సహదేవ్**
(ప్రధాన కార్యదర్శి)

సారథ్యం - డా॥ జి. హరికిషన్ | ప్రధాన సంపాదకులు - భోగ సహదేవ్

# నువ్వే ఆకాశం..


నువ్వంటూ లేకుంటే ఇక్కడ ఏమీ ఉండదు
ప్రకృతీ ఉండదు..పురుషుడూ ఉండడు..
అయినా అదేంటి..
నిన్నసలు మనిషిగానే గుర్తించడం లేదు..
వర్ణనల వంచనలో, పొగడ్తల చక్రంలో నిన్ను
ఉక్కిరి బిక్కిరి చేస్తూ శాశ్వత ఖైదీగా బంధించినా..
అదేంటి నువ్వసలు విరోధించడమే లేదు..
విశ్వకదలికలకు మూలాధారమైన నువ్వు
విశృంఖల వివక్ష కోరల్లో నలగాల్సిందేనా..
టికిలీ బొట్ల జిగురుకు, సిల్కుచీరెల సొగసుకు
నిన్ను మురిపిస్తూ మరిపిస్తే
అదేంటి అసలు..
అబలవై అశ్రువులు రాలుస్తావేం..
అనంతాలు దాటి వ్యాపించిన నిన్ను
శయనేషు రంభగా.. కార్యేషుదాసిగా
వెన్నెల సముద్రానివైన నిన్ను
కన్నీటి కడలిగా,కష్టాల కొలిమిగా మార్చి ఏమార్చితే
అదేంటి నువ్వు
కలల నది అంచున విలవిలలాడతావేం..
నువ్వు శ్వాసపోసిన శవాలే మగమృగాలైతే,
నీ సొగసుపందిళ్లలో సెదతీరి కాలనాగులైతే
విత్తనంలా విచ్చుకునే నువ్వు చురకత్తుల్ని ప్రసవించక
అదేంటి అలా..
రక్షణ లేని ఒంటరి నక్షత్రంగా మారతావేం..
నీకు పాతివ్రత్యాన్ని ఆపాదించి పిరికితనం కప్పుకున్న
మగాడు..
నీకు నీతినియమాలు అంటగట్టి దుర్నీతిగా సాగే మగాడు..
నిన్ను మట్టెల కట్టడాల్లో మంగళసూత్రాల్లో కుదించిన
మగాడు..
నువ్వు గోడల్ని బద్దలు కొట్టకుండా అడ్డుగోడల్ని నిర్మిస్తే
నువ్వేంటసలు..
బూజువలయాల పాదుకోటల్ని అంటుకొని ఉంటున్నావ్..
ఒక కిటికీ తెరిచి చూడు.. కోటి స్వేచ్ఛలు స్వాగతిస్తాయి..
నిట్టూర్పుల శుష్కస్వర్గం అంచున ఎంతకాలం నువ్వు
కాంతుల్ని కట్టేసుకుంటావ్..
నీ చుట్టే ప్రపంచం..
నీవుంటేనే చైతన్యం..
నువ్వు ఆకాశంలో సగం కాదు..
ఆకాశమే నువ్వు..!!

(అంతర్జాతీయ మహిళాదినోత్సవ సందర్భంగా...)

- సంగెవేని రవీంద్ర, ముంబై








## దర్పణం లో రేపటి కార్యక్రమాలు

**తేది 28-2-2010 , ఆదివారం, మ॥ 3 నుండి 5.30 గం॥ లకు మహిళా శాఖ ఆధ్వర్యంలో 'శ్రీ త్యాగరాజ స్వరాంజలి'**



మహిళా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ త్యాగరాజ స్వరాంజలి కార్యక్రమం ప్రముఖ స్థానిక కర్ణాటక సంగీత కళాకారులందరూ పాల్గొని తమ గాత్ర మాధుర్యంతో శ్రీ త్యాగరా స్వామి వారి స్వరాంజలిని సమర్పించనున్నారు, ఈ కార్యక్రమంలో పాడలని ఉత్సహం ఉన్న పాడగల్గిన కళాకరులందరు ముందుగా ఫిబ్రవరి 24 వ తేదీలోపల తమ వివారాలను మహిళా శాఖ కందజేయవలసిందిగా కోరుతున్నాము. సంగీత ప్రియులందరు వచ్చి ఈ కార్యక్రమాన్ని వీక్షించి, భక్తి తన్మయతలను పొందవలసిందిగా కోరుతున్నాము.

**తేది 8-3-2010 , సోమవారం మ॥ 1 నుండి 4 గం॥ లకు మహిళా శాఖ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మహిళ దినోత్సవం'**



అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళాశాఖ వారు మహిళలచే ఒక నాటిక విద్యా, ఆర్థిక, సామజిక, క్రీడ కళారంగాలలో ఏదైనసరే తమకంటూ ప్రత్యేకస్థానాన్ని సంపాదించిన ఘనత వహించిన ఇద్దరు వనితలకు, మహిళాశాఖ సగౌరవంగ సన్మానించ గలరు. వాగ్ధాటి కర్యాక్రమంలో వనితలందరు పాల్గొని భారత, భాగవతరామాయణ కావ్యాలనుండి తమకు బాగ నచ్చిన ఒక స్త్రీ పాత్రను గురించి చక్కగా మాట్లాడవచ్చు.

అలాగే రుచి కార్యక్రమం ద్వార, మామిడికాయను ఉపయోగించి చక్కటి తాజా పచ్చడి కనీసం 100 గ్రా. తీసుకొచ్చి పోటీలో పాల్గొన వచ్చును. బాగా రుచిగా ఉన్న రెండు పచ్చళ్ళకు మంచి బహుమతులందజేయబడును. ఇంకా ఇవికాక సమయానుకూలత ననుసరించి మరిన్ని సరదాలు ఉండును. సభ్యులందరు ఈ కార్యక్రమానికి రావల్సిందిగా కోరుతున్నాము.

# జరిగిన కార్యక్రమాల దర్పణం

## తేది 7-1-2010, గురువారం మహిళా శాఖా తరపున "స్వాగతం 2010"



నూతన సంవత్సరం ప్రారంభ సందర్భంగా 7-1-2010 గురువారం రోజున మహిళా శాఖ వారు నిర్వహించిన "స్వాగతం - 2010" అనే కార్యక్రమం ఎంతో సందడిగా జరిగినది. ఇందులో భాగంగా ఎన్నో ఆటల పోటీలు నిర్వహించారు పజిల్ గేమ్, 4 కార్నర్స్, బిందిగేమ్, లక్కీగేమ్, జనరల్ నాలెడ్జ్ గేమ్ ఇంకా పలు ఆటలు నిర్వహించారు. ఆటలపోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు పంచబడ్డాయి. వచ్చిన అందరూ ఆట, పాటలతో సాయంత్రం వరకూ గడిపి, అల్పాహారం సేవించి తమ సంతృప్తిని తెలియజేశారు. నూతన సంవత్సర వేడుకలు చాలా సరదాగా గడిచాయని అందరూ ఎంతో సంతోషం వ్యక్తపరిచారు. కమిటీ మెంబర్లందరూ ఎంతో సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. వచ్చిన మహిళలందరికీ ఉపాధ్యక్షురాలు కే.వరలక్ష్మి, కార్యదర్శి పొన్నూరు భారతలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

## తేది 20-1-2010, బుధవారం మహిళా శాఖా తరపున "సంక్రాంతి సుగంధాలు"





సంక్రాంతి సందర్భంగా 20-1-2010 బుధవారం రోజున మహిళా శాఖ వారు నిర్వహించిన 'సంక్రాంతి సుగంధాలు' అనే కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగినది. సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగని కదా! అందుకని మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఇందులో ఎంతో ఉత్సాహంగా మహిళలందరూ పాల్గొన్నారు. వాళ్ళు వేసిన చుక్కల ముగ్గులు, రంగు రంగుల ముగ్గులతో ఆంధ్ర మహాసభ ఆవరణంతా కళకళలాడింది. ఇందులో మూడు ముచ్చటైన, చక్కని ముగ్గులను ఎంపిక చేసి బహుమతులు పంచారు. ఎంతో ఉత్సాహంతో పాల్గొని ముగ్గులు వేసిన అందరికీ ప్రోత్సాహ బహుమతులు అందజేయబడ్డాయి. తరువాత రంగు రంగుల పూలతో మాలలు కట్టడంపై పోటీ నిర్వహించారు. ఇందులో కుడా అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారి వారి కళలను నిరూపించుకున్నారు. చక్కగా, పొందికగా అల్లిన ముగ్గురి మాలలకు బహుమతులు అందించినారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా శ్రీమతి శారదా వెంకటేశన్, శ్రీమతి కె. వరలక్ష్మి, పి. విజయారావు వ్యవహరించి, గెలిచిన వారి ప్రతిభను కొనియాడారు. తదుపరి శ్రీమతి జయా విఠల్ గారి పేరున పసుపు కుంకుమలు అందరకీ పంచబడ్డాయి. మహిళాశాఖ తరుపున చక్కని కానుకలు పంచబడ్డాయి. మహిళలు సంక్రాంతి పాటలు పాడారు 'హౌసి' ఆడారు. ఆట, పాటలతో అందరూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా నడిపి, సహకరించిన కార్యవర్గానికి. వచ్చిన మహిళలందరకూ అధ్యక్షురాలు సుసర్ల వాణీరావు, కార్యదర్శి పొన్నూరి భారతలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.



## తేది 9-1-2010, శనివారం "వడ్డేపల్లితో కవితా గోష్ఠి" మరియు కామెడీ కింగ్ "వేణు" వినోద కార్యక్రమం











శనివారం 9-1-2010 సా॥ 6.00 గంటలకు 'వడ్డేపల్లి కవితా గోష్ఠి' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి, చలన చిత్ర దర్శకులు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ గారిని ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఆయన మాట్లాతూ... "జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణ రెడ్డి, స్వర్గీయ దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి ప్రముఖ సాహితీవేత్తల స్ఫూర్తితో కలం పట్టిన తాను 1969 జనవరిలో 'వర్షించకే మేఘమా', 'కనరా నీ దేశం-వినరా సందేశం' వంటి లలిత గీతాలతో సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించానని చెప్పారు. సాహితీ రంగంలోనూ. సినీ పరిశ్రమలలో తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. లలిత గీతాలు, సినిమాలు - టెలీ సీరియల్ స్క్రిప్టులు, నటన, దర్శకత్వం, సాహిత్య పరిశోధన తదితర రంగాల్లో కృషి చేస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా అందరి అభిమానం చూరగొంటున్న డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ తన కవితలతో సభికులను అలరింపజేశారు.

కార్యక్రమంలో తొలుత ఆంధ్ర ఎడ్యుకేషన్ హై స్కూల్ ఉపాధ్యాయురాలు శ్రీమతి అన్నపూర్ణ గారి ప్రార్థన గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరము తెలుగు కామెడీ కింగ్ వేణు, లక్ష్మీకాంత్‌ల జంట ప్రదర్శించిన హాస్యవల్లరి ఆహూతులను కడుపుబ్బా నవ్వించింది. హాస్య సంభాషణతో కూడిన టీచర్-విద్యార్థుల సంభాషణ, యమలోకంలో చిత్రగుప్తుని చేష్టలు టీవీచానల్స్ లైవ్ షో పోటీలలో పాల్గొనే చిన్నారుల అవస్థలు, ప్రత్యక్ష వార్తా ప్రసారాలు అందించేందుకు టీవీ యాంకర్లు చేసే విన్యాసాలు ప్రేక్షకులను నవ్వుల సంద్రంలో ముంచేశాయి.

ఈ సందర్భంగా స్థానిక కళాకారులు శ్రీమతి భారతలక్ష్మి, కళ్యాణి, మచ్చ ప్రభాకర్, ఓ. సుబ్రమణ్యం, ఎల్లప్ప, హనుమంతరావు, యెల్డి సుదర్శన్ తదితరులు కవితా గోష్ఠిలో పాల్గొన్నారు. ఆహూతులైన తెలుగు ప్రజలకు వడ్డేపల్లి కృష్ణ కృతజ్ఞతలు తెలుపుతూ... ముంబై నగరం గురించి రాసిన కవిత '**ముంబై అరె ముంబై-బాలీవుడ్ భామలతో ఇక ముద్దు మురిపాలు తొంభై, ఇది ఉన్నవాడి చెంతనేమో ఆదు పసిడిరంభై-లేని వాడి చేతనేమో దొర్లు రాగి చెంబై, అదరగొట్టు నవ్వుడప్పుడు తీవ్రవాద బాంబై..**' ను వినిపించారు

గేయరచనా ప్రస్థానంలో 40 ఏళ్లు పూర్తి చేసుకున్న డా॥ వడ్డేపల్లి కృష్ణ గారిని ఆంధ్ర మహాసభ బీఓటీ ఛైర్మన్ టి. ఘామేశ్వర్, ప్రధాన కార్యదర్శి సహదేవ్, సాహిత్య మరియు క్రీడా శాఖ ఉపాధ్యక్షులు అనుమల్ల రమేష్ ఘనంగా సత్కరించారు. హాస్యం పండించిన వేణు, లక్ష్మీకాంత్‌లను ఆంధ్ర మహాసభ మాజీ అధ్యక్షుడు కె. రమేశ్ బాబు సత్కరించారు. సిరిసిల్ల గ్రామ ప్రజలు, ముంబయి గౌడ సంఘం, ప్రాంతీయ పద్మశాలి సంఘాలు డా॥ వడ్డేపల్లి కృష్ణ గారికి ఘన సన్మానం చేశారు. బి.ఓ.టీ సభ్యులు డాక్టర్ చంద్రశేఖర్, యెలిగేటి రాజ్‌కుమార్, రాపెల్లి పరమేశ్వర్, గుంటుక పరశురాం, బింగి సత్యనారయణ, వాసాల శ్రీహరి, మహిళా శాఖా కార్యదర్శి పొన్నూరి భారత లక్ష్మి, సోమల్ లత, తదితరులు యీ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తేది 24-1-1-2010 ఆదివారం 'విజ్ఞాన పీఠం'



ఆంధ్ర మహాసభ అండ్ జింఖానా, పద్మశాలి గ్రాడ్యుయేట్స్ అండ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రావిడెంట్ కమిషనర్ జి. గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులందించే సలహాలు, సూచనలను పాటించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలన్నారు. ఇందుకోసం పరిశ్రమించాలని చెబుతూ వారికి తన ఆశీస్సులు అందజేశారు. ఎస్సెస్సీ, హెచ్చెస్సీ, ఎంహెచ్-సీఈటీ విద్యార్థులు పాల్గొన్న ఈ సదస్సులో ప్రొఫెసర్ సంజయ్ రానడె (ఏఐఈఈఈ), నీరు ఛేడా (ఎడ్యుకేషనల్ కరియర్ కౌన్సిలర్), మచ్చ ప్రభాకర్ (సైన్సు), దత్తా పవార్ (మరాఠీ), కట్టా శ్రీనివాస్ (మ్యాథ్స్), జి. గంగాధర్ (మనోవికాసం) తదితరులు విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఆంధ్రమహాసభ తరపున ప్రధాన కార్యదర్శి భోగ సహదేవ్ విద్యార్థులకు శుభాకాంక్షలు అందజేశారు. పద్మాశాలి గ్రాడ్యుయేట్స్ అండ్ స్టూడెంట్ అసోసియేషన్ తరపున సబ్బన్ రామదాస్ (అధ్యక్షుడు), పిల్లమారపు గంగాధర్ (కార్యనిర్వాహక అధ్యక్షుడు), ఎం. చంద్రశేఖర్ (కార్యదర్శి) జక్కని శ్రీనివాస్ (కార్యనిర్వాహక కార్యదర్శి), దాస చంద్రకాంత్ (ట్రస్టీ చైర్మన్), గంజి గోవర్ధన్ (ట్రస్టీ సభ్యుడు), తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో సుమారు ఐదు వందల మందికి పైగా తెలుగు విద్యార్థులు పాల్గొనడం విశేషం.








# SHREE GANESH ENTERPRISES

***Real Estate Consultant***

**Dealing in : Sale, Purchase, Rental & Personal Loan**



Kishan G. Vasala

**Contact : 9322676343**
**Resi. : 64169134**

ఆఫీసులు, ఫ్లాట్స్, బంగళాలు అద్దెకు గానీ
కొనుక్కోలుకు గానీ అమ్మకానికి గానీ ...
ఇటు వాషి నుండి పన్వేల్ వరకు..
అటు డోంబివలి వరకు
మమ్మల్ని సంప్రదించండి



Advt.

**Office : Shop No.21, Chandresh Niketan, Lodha Heaven Nilje, Dombivali (E)**

**Resi. : Plot 12/0/5, Baiganwadi, Govandi, Mumbai - 43.**

# తేది 17-1-2010, ఆదివారం మహిళా శాఖా తరపున "విహార యాత్ర"





మహిళా శాఖా ఆధ్వర్యంలో 17-1-2010 ఆదివారం వనవిహార యాత్ర జరిగింది. థానే జిల్లాలోని " సూరజ్ వాటర్ పార్కు"కు 11 బస్సుల్లో ప్రజలు తరలివెళ్లారు. తొలత ప్రధాన కార్యదర్శి భోగ సహదేవ్ సభ్యులకు మరియు వారి కుటుంబ సభ్యులకు స్వాగతం పలికి పిమ్మట కమిటీ సభ్యులు వారి వారి అనుభవాలను వ్యక్తం చేశారు.

ఎప్పుడు బిజీ బిజీగా గడిపే సభ్యులు వారి కుటుంబంతో ఆట విడుపు కోసం వన విహారానికి అనగా సూరజ్ వాటర్ పర్కుకు వెళ్ళి సాయంత్రం వరకు ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. ఉదయం 10 గంట ల నుండి సాయం త్రం 5 గంటల వరకు వేవ్ ఫూల్, రేన్ డాన్స్, క్రేజి రివర్, లేజి రివర్‌లో సభ్యులు కేరింతలు కొడుతూ ఆడిపాడారు.



### మహిళా శాఖ వారి ఆటల పోటీలు...

మహిళా శాఖ వారు వన విహార యాత్రలో పాల్గొనిన వారందరికీ వివిధ పోటీలు నిర్వహించారు. తొలుత 'శ్రీరాం చిట్స్' మహారాష్ట్ర వారి తరపున 'తోల్ మోల్‌కే బోల్' నిర్వహించారు. కొన్ని వస్తువులు ఏర్పాటుచేసి వాటి ధరలను చెప్పిన వారికి ఆ వస్తువును సొంతంగా ఇచ్చారు. ఇది అందర్నీ ఎంతగానో ఆకర్షించింది. దీనికి ముందు శ్రీమతి అన్నపూర్ణ, సోమల్ లత, భారత లక్ష్మి తదితరులు మంచి భక్తి గీతాలు వినిపించారు. మహిళలకు హౌజి, మ్యూజికల్ చైర్, ఫోర్ కార్నర్ గేమ్స్ నిర్వహించారు. అనంతరం మహిళలు గర్బనృత్యం మరియు గ్రూప్ డాన్స్‌తో పిల్లలు, పెద్దలు నృత్యం చేస్తూ చిందులు వేశారు. ఈ విహార యాత్రలో ఆరు వందల మంది మహిళలు పిల్లలతో పాల్గొనడంతో సూరజ్ వాటర్ పార్క్ తెలుగు వారితో కిటకిటలాడింది. ఈ సందర్భంగా మహిళా శాఖ సీనియర్ సభ్యులు జయలక్ష్మి శర్మను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బి.ఓ.టి చైర్మన్ తాటికొండ భూమేష్వర్, సంకు సుధాకర్, మహిళా శాఖ కార్యదర్శి భారత లక్ష్మి, అధ్యక్షులు డా॥ జి. హరికిషన్, ప్రధాన కార్యదర్శి భోగ సహదేవ్, వై. రాజేంద్ర ప్రసాద్, అనుమల్ల రమేష్, ఎ.వి. నాగేశ్వర్ రావు, అపరాజిత, కరుణశ్రీ, ఎస్. లత, విజయలక్ష్మి, జయలక్ష్మి శర్మ, సంగెవేని విజయ, పిల్లమారపు పద్మ, రాపెల్లి పరమేశ్వర్, ఎలిగేటి రాజ్‌కుమార్, వేముల మనోహర్, ద్యావరిశెట్టి గంగాధర్, గుంటుక పరశురాం, బింగి సత్యనారాయణ, వాసాల శ్రీహరి, గుజ్జుల శంకర్, బడుగు విశ్వనాథ్, పిల్లమారపు గంగాధర్, శెకెల్లి రాములు తో పాటు ముంబయి లోని ప్రముఖులు పి.వి. నరసింహం, చిలివేరి కృపానందం, గట్టు నర్సయ్య, సంగెవేని రవీంద్ర, కె. భాస్కర్ రెడ్డి, బైరం రామ్‌మోహన్, మానాల భాస్కర్, నడిమెట్ల ఎల్లప్ప, సంగు ఆశాలు, వాసాల కిషన్, గుర్రపు కిషన్, గోపాల్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.





## తేది 26-1-2010, మంగళవారం "గణతంత్ర దినోత్సవ వేడుకలు"





ఆంధ్ర మహాసభ అధ్వర్యంలో మంగళవారం ఉదయం గణతంత్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రామానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త మోహన్ జంగియాని (గాంధీ) ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఉదయం 10.30 గంటలకు మహాసభ అధ్యక్షుడు డా॥ జి. హరికిషన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మోహన్ జంగియాని మాట్లాడుతూ... విద్యార్థులు తల్లితండ్రుల్ని, ఉపాధ్యయుల్ని గౌరవించి, వారు చెప్పినట్లు వింటేనే భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి చేరుకుంటారని, విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని చెప్పారు. గాంధీ వేషధారణలో ఆయన కార్యక్రమానికి రావడంతో విద్యార్థులు ఆయన చుట్టూ చేరి, ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక, వ్యాస రచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆంధ్ర ఎడ్యుకేషన్ హైస్కూల్ విద్యార్థిని కుమారి బి. వందన భారత దేశ స్థితిపై ఇచ్చిన ఉపన్యాసానికి సభికులు ముగ్ధులయ్యారు. 'మహాత్మా మళ్లీ రాకు', 'దేశంలో రాజకీయనాయకుల చరిత్ర' అనే అంశాలపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో పంతనగర్ మున్సిపల్ తెలుగు స్కూలుకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని ఇమ్మడి స్వాతి, అలాగే వ్యాస రచన పోటీల్లో మొదటి స్థానంలో సీహెచ్. విద్య, రెండో స్థానంలో డి. మహేష్ కుమార్, మూడో స్థానంలో కె. లలితలు గెలుపొందారు వీరికి గాంధీ వేషంలో ఉన్న మోహన్ జాంగియాని బహుమతులు అందజేశారు. అనంతరం లిటిల్ స్టార్ నర్సరీ పాఠశాల చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. లిటిల్‌స్టార్ నర్సరి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి వన్నం లక్ష్మిని అధ్యక్షులు డా॥ జి. హరికిషన్ సన్మానించారు. అంతేగాక సోమల్ లత, భారతలక్ష్మి దేశ భక్తి గీతాలు ఆలపించారు.

అనంతరం మహిళా శాఖ కార్యదర్శి భారతలక్ష్మి, మహాసభ మాజీ ప్రధాన కార్యదర్శి ఎ. మల్లికార్జున్ రెడ్డి, ఓ. సుబ్రహ్మణ్యం, సంగెవేని రవీంద్ర, ఉపాధ్యాయుడు థామస్ రెడ్డి, గుజ్జం బాలరాజు తదితరులు దేశంలో ప్రస్తుత పరిస్థితులపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శ భోగ సహదేవ్, యెలిగేటి రాజ్‌కుమార్, రాజేంద్ర ప్రసాద్, డి. గంగాధర్, పిల్లమారుపు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## తేది 1, 2 & 4-2-2010, సోమ, మంగళ & గురువారం మహిళా శాఖా తరపున "ఆటల పోటీలు"


ఆంధ్ర మహాసభ మహిళా శాఖ వారు ఫిబ్రవరి 1,2 & 4 తేదీలలో రమ్మీ, అష్టాట, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మహిళ లందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అధ్యక్షురాలు సుసర్ల వాణీరావు, కార్యదర్శి పి. భారతలక్ష్మి చక్కగా నిర్వహించారు. కార్యవర్గ సభ్యులందరూ ఎంతో ఉత్సాహంగా తమతమ బాధ్యతలు నిర్వహించారు. పోటీలలో విజేతలయిన వారందరికీ మహిళా శాఖ వారు అభినందనలు తెలిపారు.

రమ్మీ ఆటలో విజేతలయిన వారు మొదటి బహుమతి సత్యవతి, రెండవ బహుమతి కాంతం, మూడవ బహుమతి ఎస్. వాణీరావు బహుమతులు గెలుచుకున్నారు. 'అష్టాట'లో మొదటి బహుమతి లీలారావు మరియు సత్యవతి, రెండవ బహుమతి జయారావు మరియు రోహిణి గెలుపొందారు. అలాగే క్యారమ్స్‌లో మొదటి బహుమతి టి. అపరాజిత మరియు జి. శోభ, రెండవ బహుమతి కె. వరలక్ష్మి మరియు విజయారావు గెలుచుకున్నారు.

# మహిళా దర్పణం

## ఈవినింగ్ స్నాక్స్

## బేబీకార్న్ బుల్లెట్స్




**కావలసిన పదార్థాలు** - బేబీకార్న్ - 8, అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీ స్పూను, బియ్యప్పిండి - 2 టేబుల్ స్పూన్లు, మైదా - 2 టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి, ఉప్పు - రుచికి తగినంత, నూనె - వేగించడానికి సరిపడా.



**తయారుచేసే విధానం** - బేబీకార్న్‌ని కడిగి ఆరబెట్టుకోవాలి. ఒక పాత్రలో అల్లం వెల్లుల్లి పేస్ట్, మైదా, బియ్యప్పిండి, ఉప్పు, మిరియాలపొడి వేసి పకోడి పిండిలా జారుగా కలుపుకోవాలి. ఒక్కో బేబీకార్న్‌ని పిండిలో (బాగా అంటుకునేలా) ముంచి నూనెలో దోరగా వేయించుకోవాలి. ఈ బుల్లెట్స్‌ని చిల్లీ గార్లిక్ సాస్‌తో కలిపి తింటే చాలా రుచిగా ఉంటాయి.


## బేసన్ బ్రెడ్ పకోడి



**కావలసిన పదార్థాలు** - శనగపిండి - 2 కప్పులు, బ్రెడ్ పొడి - 1 కప్పు, బియ్యప్పిండి - అరకప్పు, కొత్తిమీర తరము - అరకప్పు, వెన్న - 2 టీ స్పూన్లు, తరిగిన పచ్చిమిర్చి - 2, కారం - 1 టీ స్పూను, ఉప్పు - రుచికి తగినంత, జీలకర్ర - అర టీ స్పూను, బేకింగ్ సోడా - చిటికెడు, నూనె - వేగించడానికి సరిపడా.

**తయారుచేసే విధానం** - ఒక పెద్ద పాత్రలో శనగపిండితో పాటు మిగతా పదార్థాలన్నీ వేసి నీరు చేరుస్తూ జంతికల పిండిలా కాస్త గట్టిగా కలుపుకోవాలి. చేతిలోకి కొద్దికొద్దిగా పిండి ముద్దని తీసుకుని పకోడిలా నూనెలో వేస్తు దోరగా వేయించుకోవాలి, వేడివేడిగా తింటే కరకరలాడుతూ ఎంతో రుచిగా ఉంటాయి.

## నూనెలేకుండా ఆలూ బాల్స్



**కావలసిన పదార్థాలు** - బంగాళదుంపలు - 4, పాలు - అరకప్పు, వెన్న - 2 టేబుల్ స్పూన్లు, బొంబాయి రవ్వ - అరకప్పు, బ్రెడ్ స్లయిస్ - 1, ఉప్పు, మిరియాల పొడి - రుచికి తగినంత.

**తయారుచేసే విధానం**- ముందుగా బంగాళదుంపల్ని ఉడకబెట్టి, తొక్కతీసి ఉండల్లేకుండా చిదుముకోవాలి అందులో పాలు, వెన్న, బ్రెడ్‌ముక్క, రవ్వ, ఉప్పు, మిరియాలపొడి వేసి మెత్తగా కలిపి ఉండలుగా చేసుకోవాలి. ఒక పెద్ద పాత్రలో సగందాకా నీరు పోసి, కాస్త ఉప్పు వేసి మరగనిచ్చి ఆలూ మిశ్రమ ఉండల్ని వేయాలి. ఉడికిన ఉండలు పైకి తేల్తాయి, చల్లారనిచ్చి వీటిని సాస్‌తో తింటే బాగుంటాయి. ఎప్పుడూ నూనెలోనే వేయించకుండా ఇలా కూడా చేసి చూడండి.

## చిట్టి చిట్కాలు

- పంచదార జార్‌లో రెండు లవంగాలు వేస్తే చీమల బారి నుండి కాపాడు కోవచ్చు.
- చపాతి గాని, పరోటాగాని మెత్తగా ఉండాలంటే ఒక స్పూన్ మైదా, ఒక స్పూన్ పెరుగుని గోధుమ పిండిలో వేసితడిపితే మెత్తగా వస్తాయి.
- ఫ్రిజ్ తెరచినపుడు ఒక రకమైన వాసన వస్తుంది, అలాంటప్పుడు ఒక నిమ్మపండు రెండుగా కోసి ఫ్రిజ్‌లో ఉంచండి, అప్పుడు ఏ రకమైన వాసనలు ఉండవు.

## "ముంబై !"

సాహితీ దర్పణం

కవిత

ముంబై... అరె ముంబై !
బాలీవుడ్ భామలతో
ఇట-ముద్దు మురిపాలు తొంబై !
ముంబై – అరె ముంబై!
ఇదివున్న వాడి చెంతనేమొ
ఆడు పసిడి రంబై !
లేని వాడి చేతనేమొ
దొర్ల రాగి చెంబై !
అదరగొట్టు నపుడపుడు
తీవ్రవాద బాంబై... ॥ముంబై॥

పొద్దున అనగా లేచి
ఎద్దులాగ పరుగెడుతూ
లోకలు రైలెక్కి దిగుతు
అపసోపాలెన్నో పడుతు
ఆఫీసులు చేరుకొని
ఆ పై పనులెన్నో చేసి
సందెవేళ సందాడిగా
కిందమీద పడియింటికి
చేరుకునే యంత్రమంటి
చేదుతీపి బతుకులాంటి
అనుభవాలు పంచు నట్టి
"అమెరిక" న్యూయార్కులాంటి
అమరిక యీ ముంబై ! ॥ముంబై॥

డా॥ వడ్డేపల్లి కృష్ణ

## అభినందనలు..





ప్రముఖ ముంబై తెలుగు కవి, దర్పణం మాజీ సమన్వయ సంపాదకులు సంగెవేని రవీంద్రకు ప్రతిష్ఠాత్మకమైన 'రంగినేని ఎల్లమ్మ స్మారక అవార్డు-2009' లభించిన శుభసందర్భంగా ఆయనకు మహాసభ తరపున అభినందనలు అందిస్తున్నాం.

రవీంద్ర రచించిన కవితా సంపుటి 'వలసపత్రం' కు ఈ అవార్డు లభించింది. ఈ అవార్డు కింద 11 వేల రూపాయల నగదుతో పాటు మెమెంటో, శాలువా, ప్రశంశా పత్రం ఫిబ్రవరి 7 నాడు సిరిసిల్లాలో జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో రవీంద్రకు బహూకరిస్తామనీ, ఈ కార్యక్రమానికి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపకులపతి అనుమాండ్ల భూమయ్య ముఖ్యఅతిథిగా, ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రధాన సంపాదకులు కె.శ్రీనివాస్ విశిష్ట అతిథిగా విచ్చేయనున్నారనీ అవార్డు కమిటీ కన్వీనర్ వెల్దండి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మహాసభ జీవిత సభ్యులైన రవీంద్ర మరిన్ని అవార్డులు పొంది మనందరికి గర్వకారణంగా వెలగాలనీ కోరుతూ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాం.


## అభినందన మందార మాల

అనుకున్నది సాధించాలనే 'ఆరాటం'
అందరికోసం నిరంతర 'పోరాటం'
మనందరి ఆత్మీయుడు,
అజాత శత్రువు,
అశేష జన శ్రేయాభిలాషి

**శ్రీ భోగ సహదేవ్ గారు**
**పద్మశాలి సమాజ సుధారక మండలి ట్రస్టీ గా ఎన్నికైన**
**శుభసందర్భంగా**

**హృదయపూర్వక శుభాకాంక్షలు...**



ఇంకెన్నో పదవులు అలంకరించాలని ఆశిస్తూ...

పడిమెట్ల యెల్లప్ప, ఎలివేటి కృపానందం, తాటి నరహరి, గుడ్డేటి నారాయణ, గుడ్డేటి గణేష్, భోగ సత్యపాల్, కోమల్ సూర్యప్రకాశ్, అరుష్ల మనోహర్, విశ్వలదేవి కైలాస్, కటుకం రాజన్న, కటుకం గణేష్, శేర్ల భాస్కర్, పిన్నంచెట్టి ఆనంద్, ఘ్యాకల సైరాం, గాజంగి రమేశ్, గాజంగి వెంకటేశ్, అనుముల్ల మురళి, నామాల సురేష్, అంచం రాందాస్, లింగం గణేష్.

Advt.





# కళాప్రపూర్ణ శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు

తెలుగు సినిమా రంగములో గుమ్మడిగా ప్రసిద్ధి చెందిన గుమ్మడి వెంకటేశ్వరరావు (జ. జూలై 9, 1927, మ. జనవరి 26, 2010) తెలుగు చలన చిత్రరంగంలో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవమున్న నటుడు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బహూక రించే రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత. ఈయన 500కు పైగా సినిమాలలో విభిన్న తరహా పాత్రలు పోషించాడు. చలనచిత్ర రంగానికి ఈయన చేసిన సేవలను గుర్తిస్తూ 'పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయము కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది.



సర్వేపల్లి రాధాకృష్ణన్ నుంచి జాతీయ పురస్కారం స్వీకరిస్తూ...





గుమ్మడి స్వగ్రామము గుంటూరు జిల్లా తెనాలి సమీపములోని రావికంపాడు. ఈయన ఒక సామాన్యరైతు కుటుంబంలో జన్మించాడు. ఈయన తండ్రి బసవయ్య, తల్లి బుచ్చమ్మ. 1944లో ఎస్.ఎస్.సి ఉత్తీర్ణుడై కాలేజీలో చేరాడు. తల్లితండ్రులు చదువు చాలించి ఇంటిదగ్గర పొలం పనులు చూసుకొమని ఒత్తిడి చేసినా, వాళ్లని ఒప్పించి కొల్లూరు ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి దాకా చదివాడు. ఈ దశలోనే ఈయన కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షితుడయ్యాడు. పాఠశాలలో తెలుగు పంతులు జాస్తి శ్రీరాములు చౌదరి ఈయన్ను ఎంతగానో ప్రభావితము చేశాడు.



రఘుపతి వెంకయ్య పురస్కారం అందుకొంటూ

గుమ్మడి సినీప్రవేశం అదృష్టదీపుడు సినిమాతో (కథానాయకుడిగా) జరిగింది. ఎన్.టి.ఆర్ సొంత సినిమా తోడుదొంగలు లో ఎన్.టి.ఆర్ తో సమానమైన పాత్ర పోషించారు. చిన్న వయసులోనే కారెక్టర్ నటునిగా మారారు. నిజానికి రామారావు, నాగేశ్వరరావుల కన్నా గుమ్మడి వయసులో చిన్న ఐనా అనేక చిత్రాలలో ఆ ఇరువురి నటులకు తండ్రిగా, మామగా నటించారు. నటించిన పాత్రలో ఒదిగిపోతూ అన్ని రకాల పాత్రలూ ధరించారు. పౌరాణిక, జానపద, చారిత్రిక, సాంఘిక చిత్రాలన్నిటిలోనూ పాత్రలు పోషించారు. అత్యంత విరుద్ధమైన వశిష్ఠ, విశ్వామిత్ర పాత్రలు రెంటిని గుమ్మడి ధరించి ప్రసంసలు అందుకున్నారు. దశరథునిగా, భీష్మునిగా, ధర్మరాజుగా, కర్ణునిగా, సత్రాజిత్, బలరాముడు, భృగుమహర్షి, మొదలైన పౌరాణిక పాత్రలు ధరించారు. మహామంత్రి తిమ్మరుసు చిత్రం లో ఎన్.టి.ఆర్ కృష్ణదేవరాయులు గా నటించినా చిత్రానికి పేరు గుమ్మడి పాత్ర మీదుగా ఉండటం రామారావు చిత్రాలలో ఓ అరుదైన ఘటన. అలాగే మర్మయోగి చిత్రం పేరు కూడా గుమ్మడి పాత్ర మీదే ఉంది (తెనాలి రామకృష్ణ, వీరాభిమన్యు, కర్ణ(డబ్బింగు) మొదలైనవి మిగతావి, సాంఘిక చిత్రాలలో సాత్విక పాత్రలతో పాటు ప్రతినాయకునిగా కూడా నటించారు (నమ్మినబంటు, లక్షాధికారి). 'చేదు గుర్తులు, తీపి జ్ఞాపకాలు' పేరు తో జీవనస్మృతుల్ని అక్షరీకరించారు. తొలి ముద్రణ ప్రతులన్నీ కొద్ది రోజులలోనే చెల్లిపోవటం గుమ్మడి పట్ల తెలుగు ప్రేక్షకులకున్న అభిమానానికి ఓ ఆనవాలు, గుమ్మడి జనవరి 26, 2010న మరణించారు.

## శ్రద్ధాంజలి



గుమ్మడి వెంకటేశ్వర రావు గారి ఆత్మకు శాంతి కలగాలనీ, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని ఆంధ్ర మహాసభ ప్రగఢ సంతాపాన్ని తెలియ చేస్తుంది.



## సంతాపం

మహాసభ జీవిత సభ్యులైన **శ్రీ నాగుల రాజన్** గారి తల్లి కీ.శే. శ్రీమతి నాగుల సత్యమ్మ మల్లయ్య తేది 21-1-2010 రోజున స్వర్గస్తులైనందకు చింతిస్తున్నాము.

**భగవంతుడు ఆమె ఆత్మకు శాంతి కలిగించాలని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము.**

# PG INVESTMENT SHOP

website : www.pginvestus.com

## NEW PLAN

LIC
LIFE INSURANCE CORPORATION OF INDIA

# RUSH

LIMITED PERIOD ONLY

PG - 90040 39150

HIGHEST NAV OF 7 YEARS GUARANTEED

- Payment of highest NAV over the first 6 years or NAV at maturity, whichever is higher
- Policy Term : 8 years
- Premium Paying Terms : Single or 3 years
- Partial withdrawal facility available

LIC's Wealth plus
UNIT LINKED INSURANCE PLAN

## PORTFOLIO PROFILES

• Life Insurance • General Insurance • Tax Returns • New Passport

**Medical Checkup Not Required**
Mediclaim Policy
Age upto 65 yrs. Cashless Benefit, Maternity Cover

**Pension Plan From LIC**
Decide your own retirement age. Invest now and retire wealth

**Just Pay Rs. 496/-**
Insured
10 Lakhs Cover for one year

**Office :** B.D.D. Bldg. No.94, Shop No.20, Ground Floor, Worli, Mumbai - 18 | **Tel.:** 24913408

# ఆంధ్ర మహాసభ అండ్ జింఖానా

# ఆంధ్రుల అండాదండా



సుమారు 78 సంవత్సరాల క్రితం ముంబైలో తెలుగు వారి కోసం 'ది బొంబయి ఆంధ్ర మహాసభ అండ్ జింఖానా' అనే సంస్థను ఏర్పాటు చేశారు. 8 దశాబ్దాలుగా ఈ సంస్థ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో ముంబై తెలుగు ప్రజల వేదికగా సంస్థ ప్రసిద్ధిచెందింది. ఉపాధి కోసం ముంబై నగరంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న లక్షలాది తెలుగు ప్రజల సాంస్కృతిక వారసత్వాన్ని, సంప్రదాయాలను, తెలుగు భాషను పరిరక్షించడానికి కొంత మంది పెద్దలు ఈ సంస్థను ఏర్పాటు చేశారు.

1932లో ఏర్పడిన ఈ సంస్థ మహారాష్ట్రలో తెలుగు వారి మాతృ సంస్థగా విలసిల్లుతూ 78 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలోనేకాకుండా అంతర్జాతీయంగా కూడా ఈ మహాసభ ప్రసిద్ధి చెందింది. మహారాష్ట్రలో ప్రవాసాంధ్రులకు ఈ సంస్థ ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. అనేక తెలుగు సంఘాల ప్రతినిధులు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారు. ముంబైలోని అనేక తెలుగు సంస్థలకు మహాసభ మాతృ సంస్థగా పని చేస్తోంది. ముంబై నగరంలో ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలకు చెందిన ప్రజలున్నారు. బొంబాయి ప్రొవిన్షియల్ ఆంధ్ర మహాసభ, ఆంధ్ర హోం, ఆంధ్ర నిలయం లైబ్రరీ అనే మూడు సంస్థలను విలీనం చేసి ఆంధ్రమహాసభను ఏర్పాటు చేశారు. ఆంధ్రమహాసభ ఆవిర్భవించిన రోజు నుంచి అనేక ఒడుదుడుకులను ఎదుర్కొంటూ పురోగమిస్తోంది. అయితే మొదట సంస్థ విస్తృత కార్యకలాపాల కోసం స్థలం సరిపోలేదు. దాదర్ ఈస్టులో హిందూ కాలనీ, లకంసీనపూ రోడ్ పక్కనున్న ఖాళీ ఆట స్థలం తమ సంస్థకు కేటాయించాలని అప్పట్లో మహాసభ పెద్దలు దరఖాస్తు చేసుకున్నారు. మహాసభతో ఉన్న దీనిలో హిందూ సంస్థల ప్రమేయం ఉంటుందేమోననే అభిప్రాయంతో స్థలం మంజూరులో జాప్యం జరిగింది. ఆ సందేహాన్ని నివృత్తి చేయడం కోసమే బొంబాయి ఆంధ్ర మహాసభ అనే పేరు పక్కన 'అండ్ జింఖానా' అనే పదాన్ని చేర్చి మళ్లీ దరఖాస్తు చేశారు. ఆంధ్ర మహాసభ సాంస్కృతిక క్రీడా, వినోదాల నిమిత్తం ఏర్పాటుచేసిన సంస్థ అని అప్పట్లో ప్రభుత్వానికి స్పష్టం చేశారు. వెంటనే ప్రభుత్వం మహాసభకు స్థలాన్ని మంజూరు చేసింది.

ఈ స్థలం సంపాదించడానికి, అక్కడ మొదటి దశ నిర్మాణం సాగించడానికి అనేకమంది తెలుగువారు తీవ్రంగా శ్రమించారు. వారిలో సోమంచి యజ్ఞన్న శాస్త్రి, వెంకట్రావ్, దేశీరాజు నరసింహారావు, ఇ.వి.ఎస్. దేశికావారి ఉన్నారు. 1950-60 మధ్య కాలంలో ఆంధ్రమహాసభ నిలదొక్కుకుని పురోగమించింది. ఈ కాలంలోనే ప్రథమ కట్టడం పూర్తయింది. వేదికతో పాటు ఉత్తరాన గదులు, మరుగు దొడ్లు నిర్మితమయ్యాయి. వేదిక నిర్మాణమైన తరువాత అక్కడ నాటక, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు విరివిగా జరిగాయి. 1957-58లో ఈ సంస్థ రజతోత్సవాలను ఘనంగా జరుపుకుంది. 1960-70 దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇక్కడ పర్యాటనకు విచ్చేసిన అల్లూరి సత్యనారాయణరాజుకు భవన నిర్మాణ ఆవశ్యకత గురించి పెద్దలు వివరించారు. ఆయన వెంటనే భవన నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేత 20 వేల రూపాయలను విరాళంగా ఇప్పించారు. ఈ నిధులతోనే వేదిక దక్షిణం వైపు కట్టడాలను నిర్మించారు. ఆంధ్రపత్రిక స్థాపకులైన కాశీనాధుని నాగేశ్వరావు గ్రంథాలయ ఏర్పాటు కోసం రెండు వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. మహాసభ ఆవరణంలో వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రతీ రోజూ పూజలు కూడా నిర్వహిస్తున్నారు. 1970-80లో ఈ సంస్థ ఆశించిన ప్రగతిని సాధించింది. 1974 జనవరి 26న భవన ప్రారంభోత్సవం జరిగింది. 1974లో జరిగిన ప్రథమ తెలుగు ప్రపంచ మహాసభల్లో మహాసభ ప్రతినిధులు పాల్గొనడం విశేషం.

మహాసభలో 'తెలుగు పత్రిక రచన విధానం, వికాసం, సంప్రదాయాలు' అనే అంశంపై కాశీనాధుని నాగేశ్వరావు స్మారక ఉపన్యాసాన్ని ఏర్పాటు చేశారు. మహాసభ ఆవరణలో బ్యాట్‌మింటన్ తదితర ఆటలకు సదుపాయాలు ఏర్పాటుచేశారు. మహాసభ స్వర్ణోత్సవాలు 1982 అక్టోబర్ ఒకటి నుంచి మూడో తేదీవరకు మహాసభ ఆవరణలో

జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి సన్యాసి నాయుడు ఈ ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడంతస్తుల భవనంపైన నాలుగో అంతస్తులో తగిన సౌకర్యాలతో గదులు నిర్మించారు. ఈ గదులను 1985 సెప్టెంబర్ 20న అప్పటి మహారాష్ట్ర గవర్నర్ కోన ప్రభాకరరావు ప్రారంభించారు. అనంతరం 1989లో మరికొన్ని భవనాలు ఈ సంస్థ ఆవరణలో నిర్మించారు. వీటిని మహారాష్ట్ర గవర్నర్ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. సంగీత, నాటక, నృత్య పరమైన సాంస్కృతిక రంగాల కార్యక్రమాలు ఇక్కడ జరుగుతున్నాయి. కాలగమనంలో మరుగున పడిన ప్రాచీన కళా రూపాలైన తోలు బొమ్మలాట, బుర్రకథ, హరికథ, యక్షగానం కార్యక్రమాలు కూడా మహాసభ నిర్వహించింది. సాహిత్య గోష్ఠి కార్యక్రమాలలో వేటూరి సుందరరామ్మూర్తి, యండమూరి వీరేంద్రనాథ్, సి.నారాయణ రెడ్డి, వాసిరెడ్డి సీతాదేవి, యద్దనపూడి సులోచనా రాణి, మాలతి చందూర్ పాల్గొన్నారు. విజ్ఞాన పీఠం అనే శీర్షక ప్రతినెలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, సాహిత్యం, వేదాంతం, కంప్యూటర్లు, వైద్యం, వాణిజ్య పన్ను, ఆదాయపన్ను, టెలిఫోన్, బ్యాంకింగ్, టెక్స్‌టైల్ రంగాలలో సుప్రసిద్ధులైన తెలుగువారి ఉపన్యాసాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. మహాసభ జింఖానాలో క్యారం, చదరంగం, బ్యాట్‌మింటన్, టేబుల్ టెన్నిస్ తదితర ఆటలు ఆడేందుకు వసతులు ఏర్పాటుచేశారు. ముంబై మహానగరానికి వైద్యం కోసం వచ్చే వారికి తక్కువ వ్యయంతో మహాసభలోని గదుల్లో ఉండేందుకు వసతి కల్పిస్తున్నారు. ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. మహాసభ ఆవరణలో యోగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. తిరుపతికి వెళ్లేవారి కోసం మహాసభ ఆవరణలో ఈ-రిజర్వేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం ఏర్పాటు వల్ల ముంబైలోని తెలుగు ప్రజలు ముందుగానే రిజర్వేషన్ చేసుకుని తిరుమలకు వెళుతున్నారు.


1937లో మహిళాశాఖ ఏర్పాటు...

మహిళా శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహాసభలో నిర్వహించిన కార్యక్రమాలను ప్రముఖ సంఘసేవకురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రశంసించారు. సాంప్రదాయబద్ధంగా వరలక్ష్మి వ్రతం, దసరా, సంక్రాంతి పండుగాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ముంబై నగరవాసులకు నూతన ఉత్తేజాన్ని కలుగజేసేందుకు వన విహారం లాంటి కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నారు. యువతీయువకులకు వివాహ సంబంధాలను కుదర్చడానికి కూడా మహిళా శాఖ ప్రయత్నిస్తోంది. దీనికోసం వివాహ వేదికను ఏర్పాటుచేశారు.

నాట్యం, నాటకం, సంగీతం, ఆటల పోటీలను నిర్వహిస్తూ విజేతలకు నాళం శకుంతల స్మారక బహుమతులను అందజేస్తున్నారు.

1987లో శ్రీ వేంకటేశ్వర పూజా మందిరం ట్రస్టువారు ఇంకొక నూతన మందిరాన్ని నిర్మించి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మహాసభలో ఈశాన్యదిక్కున శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నిత్యపూజలు, స్వామి వారి కళ్యాణోత్సవం, హనుమాన్ జయంతి, వేద సభ, చండీయాగం, లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నారు. హిందూ సనాతన ధర్మాధి పతులు, మఠాధి పతులు అయిన శ్రీ కంచి కామకోటి పీఠాధిపతులు, శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి, శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు, శంగేరి పీఠం శ్రీశ్రీశ్రీ భారత తీర్థ స్వామివారు, శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామివారు, శ్రీ దత్తపీఠం శ్రీశ్రీశ్రీగణపతి సచ్చిదానంద స్వామివారు, శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి వారు ఈ దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించడం విశేషం.

శ్రీ వేంకటేశ్వర స్వామి పూజా మందిరం ట్రస్టు చైర్మన్‌గా ఏ.వీ. రావు, కార్యదర్శిగా తురగా రవీంద్రలు విధులు నిర్వహిస్తున్నారు. మహాసభ నిర్వహణకు ప్రతి సంవత్సరం ట్రస్టు సభ్యులను కూడా ఎన్నుకుంటారు. ప్రస్తుత సభ్యులు... ట్రస్టు చైర్మన్‌గా టి. భూమేశ్వర్, కార్యదర్శిగా ఎల్.వి.రావులు పనిచేస్తున్నారు. మహిళా శాఖ అధ్యక్షురాలిగా సుశర్ల వాణీరావు, కార్యదర్శిగా వి. భారతలక్ష్మి విధులు నిర్వహిస్తున్నారు.



సాహితీ దర్పణం

కవిత

# "ఏక్ మచ్ఛర్"

కోరల్లో విషమున్న పాముకు
పాలు పోయడాని కన్నా -
నిలువెల్ల విషమున్న
బల్లిని పెంచడం మేలు -
పాము అవకాశాన్ని చూసి
అవసరాన్ని బట్టి
అదును చూసి, పదును చూసి
పగబట్టి ఎప్పుడు కాటేస్తుందో తెలీదు.
పక్కలో బల్లెమై పగదీర్చుకునేది తెలీదు.
విషభరితమైన బల్లి
చీడపురుగుల్నీ - కీటకాలను తింటూ
తనువెల్లి తనువు
చాలించి చస్తేనే గాని
విషపూరితం కాదు
ఏ విందు భోజనమైనా
ఆ విషయం తెలిసేదాకా
అదుపు తప్పో - అదను మరిచో
పప్పులో కాలేసినట్టు
పాపం! బల్లి పడుతుంది
పప్పులోనో, పాయసంలోనో
తన ప్రాణాన్ని త్యజించి
చేస్తుంది పరమాన్నానైనా విషపూరితం
కానీ!

నిజాయితీని చాటుతూ
సజావుగా ఉంటూ
సన్మార్గాన్ని బోధిస్తూ
సంఘీభావాన్ని చాటిస్తూ -
శత్రువులను కలుపుతూ
అందరికీ మిత్రునిలా
అవకాశాన్ని బట్టి
అవసరాన్ని అంగీకరిస్తూ
గురుతు తెలియకుండా
గుట్టు బయట పడకుండా
పరువు కాపాడుకుంటూ
పులితోలు కప్పుకుని -
నక్కజిత్తులతో
"జిమ్మిక్కు"లాడు తున్న
జీవులు, వింత జీవులు
నశనం చేస్తారు
నిలువెల్ల విషమున్న
నిజాయితీని చాటే -
అవినీతి పరులు
అవకాశ వాదులు
'సమాజాన్ని - సమూహాల్ని'
తిన్నఇంటి వాసాలు లెక్కబెట్టే
వేషగాళ్లు పగటి వేషగాళ్లు
ఊసరెల్లిలా రూపులు మార్చే

మోసగాళ్లు - పచ్చి మోసగాళ్ల
ముక్కు సూటినని చెప్పుకునే
దొంగముచ్చు నాయాళ్ల
అందరితో ముచ్చటగా ఉంటూ
రెండుమూతుల పాముల్లా
ప్రతిచోట ప్రముఖులై
ప్రతివాదులై - మితవాదులై
పడినా - లేచినా
ప్రచారాన్ని చాటుకుంటూ
అవసరాన్ని బట్టి - కొందరి ఆసరా
తీసుకుని
చలాకీగా చలామణి అవుతూ
ముందు వరుసలో
ముసుగు కప్పుకుని మసిలే
గాడిద నాయాళ్ల
మాయ గారడి నాయాళ్ల
అందుకే "ఏక్ మచ్ఛర్ సమాజ్‌కో నాష్
కర్తాహై"
అన్నది అక్షరాల నిజం!
ఎందుకో మరి ? వారినే
అనుకరిస్తున్నాం -
వారికే అవకాశమిస్తున్నాం !
మనం మారేదెప్పుడు ?
వాళ్ల "దీపాలు" ఆరేదెప్పుడు !!!

"ఆనంద భారతి"


## అభినందనలు


Manthena Ramesh
Trustee




Vasala Shrihari (Vamshi)
Working President




Dr. Vemula Sudharshan
- Copted Member

Advt.

మా చిననాటి స్నేహితులు **పద్మశాలి సమాజ సుధారక మండలిలో** అత్యాధిక మెజారిటితో ట్రస్టిసభ్యునిగా **శ్రీ మంతెన రమేష్‌ను** అలాగే అత్యాధిక మెజారిటితో కార్యవర్గ సభ్యునిగా **శ్రీ వాసాల శ్రీహరి(వంశీ) ని**, (కోఫ్ట్) కార్యవర్గ సభ్యునిగా **డా. వేముల సుధర్శన్‌లను** విరికి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించిన పద్మశాలి కుల బాంధవులందరికీ **శతకోటి ధన్యవాదములు.**

చిననాటి స్నేహితుడు **- కోడం సుధాకర్**

## శుభాభినందనలు



తెలుగు విద్యావంతులైన యువకుల ప్రతిష్ఠాత్మకమైన సంస్థ **'తెలుగు యూత్ అసోసియేషన్'** రజతోత్సవవేడుకల్లో భాగంగా ముంబైలో వివిధరంగాల్లో నిష్ణాతులైన తెలుగు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఈ సన్మానం పొందిన వారిలో అత్యాధికులు మహాసభ జీవిత సభ్యులు కావడం మనకెంతో గర్వకారణం.

**తెలుగు యూత్ అసోసియేషన్** అధ్యక్ష ప్రధానకార్యదర్శులు **కటకం గణేశ్, బోగా సదానంద్ (దండు)** నిర్వాహణలో స్థానిక రవీంద్ర నాట్యమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ సన్మాన, బిరుదు ప్రధానోత్సవాలు జరిగాయి.

**వివరాలు ఇలా ఉన్నాయి:-**

| | | | |
|---|---|---|---|
| 1) | సామాజిక రంగంలో విశిష్టసేవలందిస్తున్న | మూల సిద్దారెడ్డికి ......... | సమాజశ్రీ, |
| 2) | ముంబైలో తెలుగు సాహితీ రంగానికి వెలుగు తెస్తున్న | సంగివేని రవీంద్రకు ........ | సాహిత్యశ్రీ, |
| 3) | రచయితగా, ఉపాధ్యాయుడిగా, అభ్యుదయవాదిగా పేరొందిన | పుప్ప ప్రభాకర్‌కు ......... | విద్యశ్రీ, |
| 4) | ముంబై క్రీడా రంగంలో తెలుగు ప్రతిభను దేదీప్యమానంగ వెలుగొందిస్తున్న | ఎన్. వేణుగోపాల్ రావు ..... | క్రీడాశ్రీ |
| 5) | లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన శాస్త్రీయ సంగీతకారిణి, గాయని | డా. గిరిజాశేషమాంబకు .... | సంగీత శ్రీ, |
| 6) | చిన్నవయసులోనే తెలుగుతో పాటు మరాఠీలో కూడా గాయనిగా పేరొందిన | గజ్జెల అపూర్వకు .......... | స్వరమాధురి, |

మరియు పారిశ్రామికవేత్త గా, ముంబై ఆదికవిగా, సామాజిక కార్యకర్తగా పలురంగాల్లో సేవలందించిన జ్యేష్ఠనాగరీకులు.. శ్రీ ద్యావరిశెట్టి వేంకటేశ్వర్లుకు జీవసాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగు ఐ.పి.ఎస్ అధికారి శ్రీ కె.ఎల్.ప్రసాద్‌గారిని కూడా ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సభావేదికపై ప్రముఖ నటి శాంతిప్రియ, మహాసభ అధ్యక్షప్రధాన కార్యదర్శి డా.జి.హరికిషన్, బోగా సహదేవ్, సిద్ధివినాయక మందిరం ధర్మకర్తల మండలి సభ్యులు సంగం ఏక్‌నాథ్, తాటికొండ రమేష్, బిల్లా సూర్యప్రకాష్, పి. చలపతి తదితరులు ఆసీనులయ్యారు.


# ABHINAYA INSTITUTE OF DANCE (REGD.)



Guru Shri. Mohan & Guru Smt. Radha Mohan
Directors



## BHARATNATYAM DANCE CLASSES

**Good opportunity**
To learn dance for the people above the age of 40 years.
Special batches will be conducted for them

Tel.: 022 - 28347460 / 20331768. Mob.: 9323238870 / 9757124466

Advt.

**Venue Branches**

**Dadar (E) : The Bombay Andhra Mahasabha & Gymkhana, Dadar (East)**

**Andheri (E) : Green field society, A 3/16, 1st Floor, J.V. Link Road, Andheri (E), Mumbai - 400 093**

హాస్య దర్పణం

## నవ్వుకుందాం



### తొలి గగన విహారిణి

"ఆకాశంలో తొలిసారి ప్రయాణించిన మహిళామణి ఎవరు ?" అడిగింది టీచర్ మార్గరెట్.

"సీత - త్రేతాయుగంలోనే ఆమెను రావణుడు ఆకాశమార్గాన లంకకు తీసికెళ్లాడు" ఠపీమని చెప్పాడు పండు.


### ఇంతకీ నీ దగ్గరేదుంది?



"నా డిక్షనరీలో 'ఇంపాజిబుల్' అనే పదానికి అర్థం లేదు తెలుసా?" తొడకొట్టి గొప్పగా చెప్పాడు డేనియల్.

"ఆశ్చర్యంగా ఉందే. ఆ పదం అన్ని డిక్షనరీల్లోనూ ఉంటుంది. ఇంతకీ నీ దగ్గరున్న డిక్షనరికి పబ్లిషర్స్ ఎవరు?" అమాయకంగా అడిగాడు జావేద్.

### మనిషి తెలివి వాటికేది ?



కడియం నుండి విశాఖ పట్నం వెళ్లిన వెంకట్రావు, షీలారావులు జగదంబలో 'జురాసిక్ పార్క్' సినిమాకు వెళ్లారు. సినిమాలో డైనోసర్లు కన్పించగానే వెంకట్రావు కుర్చీ కింద దాక్కోడానికి ప్రయత్నించాడు.

"మనిషిలా ప్రవర్తించు" చిరాకు పడ్డాడు షీలారావు.

"మనిషిని కాబట్టే నన్ను నేను రక్షించుకునే తెలివుంది. అవి జంతువులు.... వాటికేం తెలుసు?" కుర్చీ కిందనుండి బదులిచ్చాడు వెంకట్రావు.

### వందకు.. రెండు!

తండ్రి - ఏరా లెక్కల్లో మార్కులు వందకు పైనే వచ్చాయన్నావు మరి రెండు మార్కులు వచ్చా యేంట్రా ?

కొడుకు - అవును నాన్నా! ఆ రెండు ఎక్కడ వేశారే చూడు వందకు పైనే కదా!


ADMISSION NOTICE FOR STD: X (SSC)

Admission closed for vacation classes

Now Admissions available for Regular Batch

for Std. X (S.S.C) XII Science & Commerce

Completing Successful 25years of teaching experience in the field of Education

For Std.
V to VIII & IX with SSC Portion
Regular class Lectures begin from
10th JUNE, 2010

S.V. CLASSES 25 SILVER JUBILEE

Advt.

Symbol Of Quality Education

S.V. CLASSES
(The Scholar's Classes)

Shop No.:2, Opp. B.D.D. Chawl No.110, Worli, Mumbai - 400013.
Phones : 24962847, 69539827. Mobiles : 9987578096, 9869079306, 9322850596.



# నా భారతదేశం

కుమారి బత్తుల వందన (10వ తరగతి ఎ.ఈ.ఎస్. హై స్కూల్)

ఈ అనంత విశాల విశ్వంలో భారతదేశం పరిమాణంలో ఎంతో చిన్నది అయినప్పటికీ మనదేశ చరిత్ర, కీర్తి ఎంతో ఘనమైనది, సాటిలేనిది.

ఎన్నో వందల, వేల సంవత్సరాల ఘన చరిత్ర, సంస్కృతుల మేలు కలయికతో కాల పరిణామం తోపాటూ అభివృద్ధి పథంలో పయనిస్తూ, గతాన్ని విడిచిపెట్టకుండా ప్రాచీనతకు ఆధునికతను మేళవిస్తూ ఇంతింతై, వటుడింతై అన్న చందాన తన ఉనికికి ఒక క్రొత్త నిర్వచనాన్ని ప్రపంచపటం పై ఆవిష్కరిస్తున్నది మన స్వతంత్ర భారతదేశం.

ఎంతో మంది మేధావులు తమ మేధస్సుకు మెరుగుపెట్టి, ఎంతో కట్టుదిట్టమైన నియమ నిబంధనలకు లోబడి ఒక ఆదర్శవంతమైన రాజ్యాంగ నియమావళిని రూపొందించడం జరిగింది. అట్టి రాజ్యాంగానికి, రాజ్యాంగ పరిపాలనా నియమావళికి లోబడి ప్రజలందరూ నిబద్ధతతో తమ విధులను నిర్వర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పరదాస్య శృంఖలాలాను ఛేదించిన ఎందరో అతిరథ, మహారథుల త్యాగఫలం మనం ఈనాడు పీల్చుతున్న ఈ స్వేచ్ఛా వాయువులు. వారి సంకల్పం, దేశభక్తి, త్యాగనిరతులను మనం ఈ గణతంత్రదినోత్సవ వేడుకల సందర్భంగా జ్ఞప్తికి తెచ్చుకోవలసిన అవసరం ఉంది.

చరిత్రపునాదుల మీద భవిష్యత్ భవనం నిర్మాణం అవుతుంది. ఈ స్వాతంత్ర్యం అనేది గతకాలంలో మనవారందరూ కలసికట్టుగా సాధించిన ఘనవిజయం. గాంధీగారొక్కరే స్వాతంత్రం తేలేదు. ప్రజలంతా మేమూ మీతో ఉన్నామంటూ వారి వెంట నడిచినందుకే. స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తొలిరోజుల్లోనూ నీతి, న్యాయం, ధర్మం ఉండేవి. స్వార్థం మచ్చుకైనా లేదు. అందుకే పరాయి పాలనలో నుండి స్వతంత్ర పాలనలోకి రాగలిగాం. ప్రజలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని నిరూపించగలిగాం.

ఈనాడు ఎందరో దేశసేవ పేరుతో జేబులు నింపుకుంటున్నారు. ఆస్తులు పెంచుకుని అందలంతో తులతూగుతున్నారు. సామాన్య ప్రజానీకానికి అందనంత స్థాయిలో ఉన్నారు. ఈ నాటి సమాజంలో ఆనాటి గాంధీలు, నెహ్రూలు, సుభాష్‌లు, భగత్‌సింగ్‌లు మచ్చుకైనా కనిపిస్తారనేది సందేహమే.

ఏదీ అప్పటి దేశప్రేమ? ఏదీ అప్పటి నిస్వార్థ సేవాతత్పరత? ఏదీ మనం అనే ఆ ఐకమత్యం? ఏదీ ఆ పోరాట పటిమ? ఏదీ అప్పటి నాయకుల మధ్య ఉన్నట్టి ఆ సయోధ్య? సత్సంబంధాలు?

సంవత్సరాలు గడిచాయి గానీ ఈనాడు నాయకులలో స్వచ్ఛత లోపించింది. స్వార్థం, స్వలాభాపేక్షతో కూడిన కుటిల రాజకీయాలే పరమార్థంగా దేశం నడుస్తోంది తప్ప నిజమైన రాజనీతి, దేశభక్తి, ప్రజాసంక్షేమం అనే పదాలకు అర్థమే మారిపోయింది. ఈ నాటి సంఘంలో అందరూ హక్కులకోసం పోరాడే వారే తప్ప తమ తమ బాధ్యతలు నెరిగి ఎంతమంది మెలుగుతున్నారు? ఏ రంగంలో చూసినా ఏ వృత్తిఉద్యోగాలలో చూసినా అరాచకం, అవినీతి తారాస్థాయిలో దర్శనమిస్తున్నాయి. దీని వలన నష్టపోతున్నది సామాన్య ప్రజలే. ఎవరికివారు ఎవరో వస్తారు? ఏదో చేస్తారు అని ఎదురుచూడక తమ బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తిస్తే వీటిని తుదముట్టించవచ్చు. అంతేకాదు స్వాతంత్ర్యదినోత్సవాలు, గణతంత్రదినోత్సవాలు కూడా ఓట్ల బ్యాంకులు నింపుకోడానికి పరపతిని పెంచుకోడానికి మాధ్యమాలుగా మలచబడ్డాయి. వీటిని అరికట్టే సమయం ఆసన్నమయింది.

బాధ్యత గల పౌరులందరూ సమిష్టిగా తమ బాధ్యతలెరిగి ప్రవర్తించాలి. తమ హక్కులను ఉపయోగించుకుంటూ సర్వజనుల సంక్షేమాన్ని పెంచే విధంగా నాయకులకు తమవంతు బాధ్యతలను గుర్తెరిగించే రీతిలో కృషిచేయాలి. వారిని క్రియాశీలక రాజకీయాల వైపు మళ్ళించి ప్రజాస్వామ్యవ్యవస్థ పరమార్థాన్ని సాధించాలి.

ప్రజలంతా ఎవరికి వారు తమలో లేనిదేమిటి? సమాజానికి కావలసిన దేమిటి అని ఆలోచించాలి. తమలోకి తాము తొంగి చూడాలి. మంచిని పెంచుకొని స్వార్థం, అవినీతి, అరాచకాలకు స్వస్తి చెప్పాలి.

భారతీయులు నిరంతరం మానవతా విలువలే. దేశాన్ని రక్షించేవి అణ్వస్త్రాలు, ఆయుధాలు కావు. రాజకీయనాయకులు కారు. నీతినిజాయితీ గల ఉత్తములైన స్త్రీ పురుషులే దేశాన్ని రక్షించగలరు. వారే దేశము యొక్క నిజమైన సంపద.

అందు మూలంగా నేటి విద్యార్థులే రేపటి నేతలు, భాగ్యప్రదాతలుగా ఎదగాలని, చరిత్రలోని మహానుభావుల వలె సత్ప్రవర్తన కలిగి ఉండాలని, దీనికి పెద్దలు మార్గదర్శకులు కావాలని, చేయూతనివ్వాలని ఆశిస్తున్నాను.

మనందరి సమిష్టి కృషితో భారతదేశం అన్ని రంగాలలో అత్యధిక అభివృద్ధిని సాధించి ప్రపంచపటంలో ధగధగలాడాలని ఆసిద్ధాం.

## మహిళా శాఖ అద్వర్యంలో జరుగబోయె కార్యక్రమాలు



## 'శ్రీ త్యాగరాజ స్వరాంజలి'

**తేది - 28-2-2010, ఆదివారం, మ॥ 3 నుండి 5.30 గం॥ లకు**

శ్రీ త్యాగరాజ స్వరాంజలి కార్యక్రమం ప్రముఖ స్థానిక కర్ణాటక సంగీత కళాకారులందరూ పాల్గొని తమ గాత్ర మాధుర్యంతో శ్రీ త్యాగరా స్వామి వారి స్వరాంజలిని సమర్పింపనున్నారు.

ఈ కార్యక్రమంలో పాడలని ఉత్సహం కళాకరులందరు ముందుగా తమ వివారాలను ఫిబ్రవరి 24 వ తేదీ లోపు మహిళా శాఖ కందజేయవలసిందిగా మనవి.

## 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'



**తేది 8-3-2010, సోమవారం మ॥ 11 నుండి 4 గం॥ లకు**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళాశాఖా వారి తరఫున సన్మాన కార్యక్రమంతో పాటు మహిళలకు వివిధ కార్యక్రమాలతో పాటు కొన్ని పోటీలు నిర్వహించనున్నారు.

**పై రెండు కార్యక్రమంలో మహిళ సభ్యులందరు భారి ఎత్తున రావల్సిందిగా మహిళాశాఖ కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.**



## జరుగబోయె నాటిక ప్రదర్శనలు



### 'కన్యాశుల్కం

**19-2-2010, శుక్రవారము సాయత్రం 7.00 గంటలకు**

రసరంజని సమర్పించి గురజాడ అప్పారావు రచించిన నాటిక ప్రదర్శన


### 'మరో మోహంజదారో'

**20-2-2010, శనివారము, సాయంత్రం 7.00 గంటలకు**

రసరంజని సమర్పించు మరో నాటిక


ముఖ్య అతిథి : డా॥ కె.వి. రమణాచారి IAS

## అభినందనలు..



శ్రీ వాసాల శ్రీహరి (వంశీ)

పద్మశాలి సమాజ సుధారక మండలి త్రై వార్షిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచినందులకు మా హృదయ పూర్వక అభినందనలు..



శ్రీ జిందం భాస్కర్



తాటికొండ మోతిరాం



కోడం వెంకటేశ్



సిరిపురం వెంకటేశ్



సుంక ప్రభాకర్



సురుకుట్ల సురేష్


Advt.


RUCHI CATERERS
Veg. & Non-Veg. Buffet Service
Tasty Food Good Service is our Motto
Motiram Tatikonda
9967437092
9322867064


మీ అమూల్యమైన ఓటు వేసి మా స్నేహితులను గెలిపించిన పద్మశాలి బాంధవులకు మా హృదయ పూర్వక ధన్యవాదములు.

స్వస్తిక్ ఎంబ్రోడరి
ఫోన్ - 9869048630

# మేధో శక్తిని పెంచే ఆహారం



మెదడు - మన శరీరంలో అత్యంత శక్తివంతమైన భాగం. కండరాలు దృఢంగా తయారు కావాలంటే ప్రోటీన్లు వున్న ఆహారం ఏ విధంగా అవసరమో, అలాగే మెదడు చురుకుగా పనిచేయటానికి కూడా తగిన ఆహారం మనం తీసుకోవాలి. మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారంలోనే చిన్న చిన్న మార్పులు చేస్తే మేధాశక్తిని పెంచుకోవచ్చు. మరింత చురుకుగా ఆలోచించవచ్చు. నలభై ఏళ్ళు దాటినవారికి జ్ఞాపకశక్తి తగ్గటమే కానీ, పెరగటం వుండదని పరిశోధకులు చెబుతున్నారు. అయితే, తగిన ఆహారం తీసుకుంటే ఈ తగ్గుదలను పూర్తిగా అరికట్టవచ్చని పరిశోధనలలో తేలిన విషయం.

ఉదయం పూట తినే టిఫిన్‌ని చిన్న చూపు చూడవద్దని పరిశోధనలు చెబుతున్నాయి. మెదడు చురుకుగా పనిచేయటానికి అవసరమైన శక్తిని గ్లూకోజ్ ఇస్తుంది. మనం తీసుకునే బ్రేక్‌ఫాస్ట్ - అంటే - ఈ గ్లూకోజ్‌ను అందిస్తుంది. బ్రేక్‌ఫాస్ట్ మానివేసిన పిల్లలు స్కూల్స్‌లో తక్కువ చురుకుగా వుంటున్నారని తేలింది. అదే పెద్దవారయితే, డ్యూటీ చేసే సమయంలో తెలియని చిరాకు వారిని వేధిస్తుందని తేలింది.

బ్రేక్‌ఫాస్ట్‌గా ఏం తీసుకోవాలి?

ఉదయమే బిస్కట్స్, పిజ్జా, కేక్స్, బర్గర్, పఫ్ వంటి పదార్థాలను తినే పిల్లలు కానీ పెద్దవారు కానీ అంత చురుకుగా వ్యవహరించలేక పోతున్నారని పరిశోధకులు చెప్పారు. వాటికి బదులు బీన్స్, మెలకెత్తిన గింజలు వంటివి తీసుకునేవారు చాలా చురుకుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. వీటికితోడు పాలు తప్పనిసరి. పీచు (ఫైబర్) వున్న ఆహార పదార్థాలు - ప్రధానంగా ఆకుకూరలు వంటివి అత్యధికంగా మేలు చేస్తున్నాయి. బేకరీలలో తయారైన వస్తువులకు దూరంగా వుండాలి. ఇవి ట్రాన్స్ ఫాటీ యాసిడ్స్‌ను కలిగి వుంటాయి. ఇవి శరీరానికి మేలు చేయకపోగా, క్యాన్సర్ కారకాలుగా పనిచేస్తాయి.

మధ్యాహ్న భోజనం....

ఇక మధ్యాహ్న భోజనం విషయానికి వస్తే కోడిగుడ్లు తప్పనిసరి. కోడిగుడ్డు నుంచి మన శరీరం న్యూరో‌ట్రాన్స్ మీటర్స్‌ను తయారుచేసుకోగలుగుతుంది. ఎసేటిల్కో లైన్ దీనికి ఒక ఉదాహరణ. ఇది తక్కువైతే అల్జిమర్స్ వ్యాధి వస్తుంది, న్యూరో ట్రాన్స్‌మీటర్స్ జ్ఞాపకశక్తిని పెంచుతాయి, మెదడును ఉత్తేజపూరితం చేస్తాయి. మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఆకుకూరలు, పళ్ళు, పచ్చని కూరలే శరీరానికి మిత్రులు అనేది గుర్తుంచుకోండి. వీటిలో విటమిన్లు ఎక్కువగా ఉండటమే కాక, ఫైబర్ అత్యధిక స్థాయిలో వుంటుంది. పెరుగును ఎక్కువగా తీసుకోవటం మరిచిపోవద్దు. పెరుగు 'అమినో యాసిడ్ టైరోసిన్' లను కలిగివుంది. ఇది వత్తిడిని తట్టుకునేందుకు అద్భుతంగా పనిచేస్తుంది. అంతే కాకుండా న్యూరో ట్రాన్స్ మీటర్లను ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడుతుంది. పెరుగు మెదడుకే కాక, చర్మానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. జీర్ణ కోశాన్ని చక్కగా పనిచేసేలా చేస్తుంది.

చేప సంబంధ ఆహార పదార్థాల గురించి ఎంత చెప్పినా తక్కువే! ఇవి గుండెపోటు రాకుండా నివారిస్తాయి. నేత్ర సంబంధ వ్యాధులను రాకుండా అరికడతాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

వీటిలో కొవ్వు శాతం బాగా తక్కువ. అందువల్ల ఇవి ఇతర మాంస సంబంధ ఆహార పదార్థాల మాదిరిగా శరీరానికి ఎంత మాత్రమూ హాని చేయవు. మేధస్సును అపరిమితంగా శక్తివంతం చేస్తాయి. వీటిలో వుండే ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్ మెదడులోని కణాలను ఉత్తేజితం చేస్తాయి. ఏ ఇతర ఆహార పదార్థంలోనూ ఈ స్థాయిలో ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్ ఉండవు.

## డియర్ మెంబర్స్

"దర్పణం" పట్ల మీ అభిమానాన్ని, కవితలు, కథల పట్ల మీ అభిప్రాయాలను మాకు తరచుగా ఉత్తరాలు, లేదా ఎస్ఎమ్ఎస్ ద్వార తెలియజేస్తూ మీ ఉత్తమాభిరుచిని వ్యక్తం చేస్తున్న విధానం మా కెంతో ఆనందం కలిగిస్తోంది. మీ అభిప్రాయాలకు ప్రతిబింబంలా "దర్పణం" తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నాము. దర్పణం గురించి మీ అభిప్రాయాలు రాయండి.

# పేపరు... లో... ఓ పడతి వార్త

శ్రీమతి రాటకొండ సౌజన్య

ఈ రోజు పేపర్లో మొగుడి పైశాచికంతో పడతి బలి అన్న వార్త నన్ను కలవరుపెడుతుంది, ఇంకోరోజు అలాంటివార్త చదవలేదన్న విషయం నన్నే హెచ్చరిస్తుంది. సాంకేతికంగా ముందుకు సాగుతున్నాము. ఆర్థిక స్వేచ్ఛను అందుకొంటున్నాం, అయినా ఈ వార్తలు వినిపిస్తునే వున్నాయి. ఈ వార్త నేనీరోజు చదువలేదన్న భ్రమనన్నాలింపచేస్తుంది. సమాజంలో అందరం వున్నాం, కానీ ఈ అరాచకాలను ఆపేదెవరు? సమస్యను ప్రశ్నించేదవరు? నిలదీసేదెవరు? మనకెందుకన్న ధోరణి కనిపిస్తోందదరిలో అందుకే అనాదిగా వస్తూనే ఉంది సమస్య. పైగా ఇది వాళ్ల కుటుంబ విషయం మనమెందుకు కలుగచేసుకోవాలి అన్న తర్కంలో తప్పించుకోనే మనస్తత్వం అందరిది. అయినా కుటుంబాలు కుటుంబాలుగా జీవిస్తేనేగా సంఘం దేనికది విచ్ఛిన్నం అయితే ఎక్కడి దీ సంఘం?

మగాడికి జన్మనిచ్చింది తనూ ఆడదేగా... అమ్మతనంలో ఆడదిగా సంతరించుకొన్న స్త్రీ. తనకొచ్చిన కోడలు ఆడదేనన్న విషయం గ్రహించదు. బహుశా తను కోడలిగా ఉన్నప్పుడు ఇదే పరిస్థితి ఉంటే ఎలా ఉంటుందో ఊహకు కూడా రానీయదు, ఈ రోజుల్లో మధ్య తరగతికాదు, అన్ని తరగతుల అమ్మాయిలకు అత్తారిల్లంటే మరో రూపంలో నరకం. తన జీవితానికి, కోడలి జీవితానికి వెత్యాసమెందకో? అత్తగా ఒక్కసారైనా ఆలోచించదు. పైగా మారోజుల్లో మేము ఇలా కాదురా.... అని సన్నాయి నొక్కులు కొడుకు ముందర. అంటే ఇన్ని సౌకర్యాలుండి నీ పెళ్లానికేం జాడ్యం అని కరువుగా ఉండేలా అంటే, తల్లి లోని మృదుత్వం కనబడదు మరి?...

ఇక్కడో వింత ఆచారం అనాదిగా వస్తున్నదే అయినా చర్చకు తీసుకోంటె. తల్లిదండ్రులు మాట్లాడే భాష ఏమిటీ ప్లస్, మైనస్. అంటే అబ్బాయి ప్లస్ అమ్మాయి మైనస్ అత్తవారింటికెళ్లేటప్పుడు అన్నీ పట్టుకెళ్తుందికదా పైగా తనుకూడా వెళ్లిపోతుంది కదా అందుకేనేమో! తీసివేత లెక్కక్రింద జమకడుతారు. అమ్మాయికి పూర్వం అంటే ఇతిహాస పూరాణంల్లో ఎంతమంది ఆడపిల్లలుంటే అంతహోదా గౌరవం ఇచ్చే మీరు ఆడపిల్లల తండ్రికి ఎందుకంటే వాళ్ళు వెళ్లిన ఇంట్లో సౌభాగ్యం, సంతానం అందించే వారుగా స్త్రీలను కొలిచే వారు కావున ఈనాడది పూర్తిగా విరుద్ధం. అబ్బాయి అయితే పెళ్లినాటికి బాగా ముట్ట చెబుతారు అమ్మాయి వారుకావున తమ పిల్లలను కట్నంకు ఎరవేస్తారు. పెళ్లి కోసం పైచదువులు చదివే అబ్బాయిలు లేకపోరు. ఎంత చదివితే అంత కట్నం మరి. కట్నం ఇచ్చి వచ్చిన అమ్మాయి. ఇక్కడ సవ్యంగా నడుచుకోవాలి మరి.... ఎరగా అబ్బాయి. ఇక్కడ పెళ్లితంతలో, మరి ఎరను పట్టుకోడానికొచ్చిన చేపపిల్ల సంగతి ఏంటో మరి విడిగా చెప్పక్కర్లేదు. ఆ తరువాత ఆ పిల్ల (చేప) అగచాట్లెన్నో, శారీరక హింసలు, మానసిక ఘర్షణ చివరకోసారి నెట్టుకురాలేక ఆత్మత్యాగం. ఇవన్నీ చూసి కూడా సభ్యసమాజం ఏమి పట్టనట్లుంటుంది. అది మరీవింత.

మనిషికి డబ్బుపైన దురాశ, సంఘంలో అనవసరమైన డాబుదర్పం కోసం. ఇంటిలో దీపం వెలిగించాల్సిన కోడలు పిల్ల, ఇంట గ్యాస్ పొయ్యి మంటల్లో ప్రమాదవసాత్తు కాలి పోతుంది మరి ఈ సమస్య ఎంతగా వున్నా, ఎన్ని యంత్రంగాలున్నా, చట్టాలున్నా, ఎవరికి ప్రయోజనం. ఆ ప్రశ్నస్తే సమాధానం సూన్యం. బహుశా ఇలాంటి సమస్యలు, సమస్యరూపేణ బయట పడుతాయి, కాని ఇంకో రూపంలో వున్న సమస్యలు వెలుగు కూడా చూడ్డంలేదు.

అది మానసిక వేధింపులు, సమస్యలవంటివె ఓ ఇల్లాలి తో మాట్లాడుతున్నా చాలా జాలేసింది. పాపం తనోఉద్యోగి, పేరుకే తను ఉద్యోగం చేస్తుంది, జీతం మాత్రం మొగుడికే సమర్పించాలి. కనీసవసరాలకు డబ్బిచ్చి తనో పెద్ద కార్యం చేసినట్లు బిల్డప్ తను దూబారా కూడ, ఉండనివ్వు అనుకోంటే కనీసం సౌకర్యాలు కూడా అనవసరపు ఖర్చులంటే కొంచెం ఖాదేస్తుందని వాపోయింది.

ఇది ఇంకోరకంగా స్త్రీని దోచుకోవడం కాదా ? ఇదంతా మన హైందవ సంప్రదాయం! మొగుడిని దైవంలా భావించాలి అని నిజంగా పతిదైవమేనా! సాంప్రదాయాలు మనకుగా మనం పెట్టుకొనాలి కాదా! సంప్రదాయాలు మనకు మనశ్శాంతిని ఖ్యాతిగాని! వాటి పేర చిచ్చు రేపకూడదు.

ఇంకో సమస్య అమ్మాయి మంచి చదువు బాగాచదువుకొన్న అమ్మాయి అయితే ఇద్దరి పట్ల అవగాహన బాగుంటుంది అని మరి కోరి చేసుకొన్నారు. తీరా వెళ్లాక తెలిసింది తన చదువు వారింటి కో స్టేటస్ సింబల్ అని, పరిస్థితులన్ని మామూలే, ఇల్లన్నాక వ్యవహారాలు, పిల్లలన్నాక పేచీలు ఉంటాయి. సర్దుకుపోవాలి... నిజమే ఇల్లాలంటే వెనకెవరో అన్నట్లు 'గ్లోరియస్ సర్వెంట్' పొద్దున నుంచి ప్రొద్దుపోయే దాకా పనులే పనులు తనకోసం కాకుండా, క్రోవ్వత్తి జీవితానికి ప్రతీక అమ్మాయి జీవితం.

మహానగరాల్లోకి వచ్చిన పల్లెటూరి పిల్ల సంగతి మరీ విడ్డూరం, నగరం అంటే మహాగొప్ప మరి. దేశంలో వున్న (పల్లెటూరు) పిల్లకి ఇదో గొప్ప. అబ్బాయి జీతం పదిహేను వేలు, ఆపిల్ల తండ్రికే తెలుసు అది బొటాబొటి జీ(వి)తం అని మూడు వెల రూపాయలుంటే పల్లె జీవితంలో పువ్వుల నవ్వులైతే ఆ లెక్క తో ఐదురేట్లు ఎక్కువనుకొనే అమాయకపు తల్లితండ్రులున్నంతవరకు. ఈ పిల్ల జీవితం ఇంతేమరి!

పుట్టెడు ఆశతో చిగురించిన ఆ చిగురుటాకు వేగవంతమైన సుడిగాలి పట్టణవాసన ఎన్ని ఎదురుపాట్లో, ఎన్ని సర్దుబాట్లో మొగుడే | ఉదయం 9.00 గంటలకే ఇల్లు వదలడం,

రాత్రి పది దాటితే గాని కనపడని తనకోసం ఎదురు చూస్తే తన (పడతి) భార్య ఒకటుందని ఆలోచన వస్తుందో లేదో! ఏంటో మాటలేదు మంతిలేదు. పేర్చిన మాటలన్ని చెబుదామని ఎదురిచూసి అలసిపోయే! రోజులో అత్తగారి హుకుమత్తులు, మామగారి అధికారాలు, ఆడపడుచు ఛీదరింపులు ఇలా భయపడుతూ సాగే జీవితంలో, కన్నుల్లో నింపుకొన్న తడి ధయచూసే తీరికెక్కడిది తన పెనిమిటికి. గజిబిజి జీవితం, హడావిడి బ్రతుకులో మేటి సుఖంకోసం తన తనువు తాకడమే తెలిసిన మగడికి, ఆ తనువులో మనసుటుందన్న విషయం ఊహకైనారాదే! అంతేగా మనస్సు పంచుకోలేని మగడుతో ఆ జీవితం ఓ మనుగడే జీతభత్యాల్లేని పనిమనిషి భత్యంలే పోతే! నీరసించదు?? అన్ని అవసరాలు తీర్చడానికైనా శక్తి ఉండాలిగా! లేపోతే రోగిష్టిదవదు? కొంత మంది భార్యమంచాన పడ్డా హాస్పిటల్‌కికూడా ఖర్చు అని ఫీలవుతున్న రోజులివి. ఇదే జీవితం అని సర్దుకు పోవాలి. పోయే వాళ్లు వున్నారు. అందుకే సమస్యలంత తగురూపం దాల్చడంలేదు. ఇది సమస్యా? అని కొట్టి పారేసేవాళ్లులేక పోలేదు.

తనదాకా వస్తేగాని విషయం భోదపడదన్న నానుడి వీరిని హెచ్చరించాలి. గృహిణీ, ఉద్యోగి తల్లి అన్ని భాద్యతలు ఆడదానికే మగాడికి లేవా? అయినా తప్పు ఎక్కడ జరుగుతుంది. సమాజంలోనేగా. సమాజం ఎక్కడో వున్నట్టు మనకెందుకులే అన్నధోరణి. మగాడు ఆడదానికి ఉద్యోగిగా ఆర్థిక స్వతంత్ర్యం ఇచ్చిన ఆర్థిక లాభం మాత్రం తనదే! తన సంపాదనలో చిన్నచిన్న అవసరాలు తీర్చుకోలేని గృహిణులున్నారు.

అందుకే ఓపిక లేని స్త్రీ, చట్టాన్ని ఆశ్రయిస్తుంది వెసులుబాటు కోసం. అప్పుడో కవిగారన్నట్లు లేచింది మహిళాలోకం ఫలితంగా పోటేత్తిన జీవిత తుఫానులో విడాకుల గొడుగుక్రింద ఓ చిన్న ఊరట మళ్లీ తెరిపిస్తుందన్న జీవితం పై ఆశతో ఇలా చర్చించుకొంటూ పోతే అనాదిగానే కాదు ఈ నూతన ఉగాది వరకు మార్పులేని 'అతివ జీవితం చర్చేకదా! కాని పరిష్కారం చర్చలో కనబడదుగా! కనిపించిన పిసరంతే అది సరిపడునా? మళ్లీ మహిళకు అన్యాయం జరుగుతుంది. మళ్లీ మొదలు మహిళసంఘాలు ఉక్రోషంతో కడలిలో అలలాగే ఉవ్వెత్తున లేస్తాయి. సమాజంలో స్తంభన లేని ఒడ్డుకు చేరుతాయి. మళ్లీ ఆ అల ఉనికెక్కడో! ఇలా మళ్లీ మళ్లీ వినిపిస్తూనే వుంటాయి. ఈ వార్తలు ఇది ఖర్మభుమి కావున ఖర్మఫలం అనుభవించాలని సరిపెట్టుకోవాలా?.

కానీ సమస్య ఇలాగే కొన సాగుతూనే ఉంటుందా? లేదు? ఎందుకంటే మన ఆలోచనల్లో మార్పులు వస్తే ఈ పరిణామం పునారావృతం కాదని గట్టినమ్మకం. ఇలా ఆలోచించి చూడండి సమస్యలు వచ్చినప్పుడు. అమ్మాయి తల్లిదండ్రులు అమ్మాయికి సర్దిపంపుతారు. కాని ఇది అబ్బాయి తల్లిదండ్రులు చెయ్యరు. ఎందుకు? పెద్ద వాళ్లుగా ఉండి సమస్యను తీవ్రం చెయ్యాలి! ఎందుకంటే కోడలు చెప్పు చేతల్లో వుండాలన్న ఆలోచనలు ఎప్పుడు అడుగంటుతాయో!

అప్పుడు ఈ సమస్య తలెత్తవుకదా! అమ్మాయి తల్లిదండ్రులు అయిష్టంగానే తనను కాపురానికి పంపుతారు. ఎందుకంటే సభ్యసమాజంలో అమ్మాయిని మొగుడొదిలేసాడని ముద్ర పడుతుందన్న భయంతోనో లేక సభ్యసమాజంలో ఈటెలలాంటి మాటలకు తట్టుకోలేక ఈ వేదింపులకన్నా, ఆనాల్గోడలమధ్య అమ్మాయి పడే బాధ కనబడదు, పైగా దూరంగా ఉంటుంది కనుక. కాని ఆశ్చర్యం ఏంటంటే పెళ్లాన్ని వదిలేసాడు అని అబ్బాయిని ఆ మాటల తూపులు వెంటాడవు. ఎందుకంటే మగాడు ఏది చేసినా చెల్లుతుంది కావున సభ్యసమాజంలో మగాడు ఎప్పుడూ ఓ మెట్టుక్కువే కాని అసలు ఉనికే లేదంటే నే బాదనిపిస్తుంది.

రాధగోపాలం సినిమాలో మగాడు ఆడదాని కన్నా కొంచెం ఎక్కువే అని డైరెక్టర్ సమస్య చాలా చక్కగా చూపెట్టారు. కాని అది సినిమా రెండుగంటల సమస్య పరిష్కారం సుఖాంతం అన్నివుంటాయి, ప్రేక్షకుల ఆనందంకోసం బహుశా మన సమస్యలను అలా పరిష్కరించుకోమని మనకో సలహాను ఇచ్చినట్టనిపిస్తుంది. కాని నిజజీవితంలో జీవితం అంతం అయినా సమస్య మాత్రం తరతారలకు ప్రాకుతూనే వుంది, మరి ఈ తుచ్చ పరంపరను. మనం అంతం చేయచ్చుగా! అందులోనూ మానవుడు ఎన్నో ఎత్తులకు ఎదుగుతున్నా, ఇక్కడ చూస్తే ఆ ఎత్తులన్నీ ఎందుకని పిస్తుంది. నైతికంగా పతనమైయ్యే మనము ఎంత ఎదిగినా ఇలాంటి దుస్సాంప్రదాయాలను రూపు మాపలేక పోతున్నాం. సమాజంలో విజ్ఞత తెలివికలిగిన మనిషి, జంతువుల ముందు ఈ విషయంలో వెనుకనే వున్నాడనిపిస్తుంది. బుద్ధి జీవి మనిషి కానీ లాభంఏంటి ఎక్కడవుంది. ఈ సంప్రదాయం మిగతా జీవులకు ఇకనైనా, ఈ అరాచకాలను రూపు మాపెందుకు మనమే కంకణం కట్టుకోవాలి. పెళ్లి అనగా మనసులు కలవాలి కాని, ఆస్తి అంతస్తులు ఆచార వ్యవహారాలుకాదు. కట్నం, అన్న పిశాచాన్ని అక్కడే తగులబెట్టండి. నవ దంపతుల జీవితాల్లో నూతన కాంతులు నింపండి అబ్బాయి లకు పెళ్లంటే కేవలం శారీరక సుఖం కోసమే అన్న అవగాహనను మార్చండి. ఇంటిల్లిపాదికి అవసరాలుతీర్చి, వారిని కంటికి రెప్పలలాగా చూసే ఆ ఇల్లాలి మనసెరిగి నడుచుకోండి. ఆ నవ కాంతులను మీరే నింపగలరు.

ఇంట్లో రోజూ దీపం పెట్టాల్సిన కోడలిని, కట్నకానుకల పిశాచానికి బలికానివ్వకండి. మీ కూతురిలా స్థానం కలిపించక పోయినా కనిసం ఓ అమ్మాయిలా చూడ్డానికి ప్రయత్నించండి. మీ అవగాహన ఆలోచనలు కోడలి పట్ల మార్చుకోండి. రేపు వచ్చే పెపరులో ఈ వార్తలకు చోటివ్వకండి.

**- సౌజన్య 9224253384**

# చివరి పలుకులు



పుట్టినవారందరూ గిట్టక తప్పదు. మరణం అంటే ఏమిటి ? దాని స్వరూపమేమిటి ? అది సుఖమా? దు ఖమా – అన్న వాస్తవాన్ని అనుభవపూర్వకంగా చెప్పిన వారెవరూ లేరు. అది సాధ్యం కూడా కాదు. చావు చెయిపట్టి ఈడ్చుకుపోతున్నప్పుడు దానిని ఎగతాళి చేసినవారున్నారు. మరణశయ్యపైవున్నా కొందరు సుప్రసిద్ధులు ధీరోదాత్తంగా పలికిన వలుకులు చదవండి.

భారతకోకిల సరోజినీనాయుడు, చనిపోయేముందు తన పనికత్తె నోటినుండి ఒకపాట వినాలని కోరింది.



"నాకు పాటరాదు" అన్నదా పనికత్తె.

"నీకు వచ్చినట్లు పాడు" అన్నది ఆమె.

సరోజిని, ఒత్తిడిచే సింది. విధిలేక, తనకు వచ్చిన తీరులో పాడింది పనికత్తె, 'భారతకోకిల' ఆనందంగా విని, తృప్తితో దేహపంజరంనుండి అనంతంలోకి ఎగిరిపోయింది.

ప్రముఖ హాస్య రచయిత రోజ్లో, రోగగ్రస్తుడై వున్నప్పుడు మృత్యువు వాకిట పొంచివుంది. ఆ సమయంలో కొందరు డాక్టర్లు ఆయనను పరీక్షించి, తాము సూచించిన మందును ఒక మోతాదు తీసుకోమన్నారు.

రోజ్లో చిరునవ్వుతో "దయచేసి నన్నుసహజంగా చనిపోనివ్వండి" అన్నాడు. కాసేపటి తర్వాత "తెరతీయండి, ప్రహసనం ముగిసింది" అన్నాడు.

నీరో చక్రవర్తి పేరు వినేవుంటారు. రోమ్ తగులబడినపుడు నీరో ఫిడేలు వాయిస్తూవున్నాడు. చనిపోయేటిముందు "ఈ ప్రపంచం నాలాంటి గొప్పవ్యక్తిని కోల్పోతుందే ! అయ్యోపాపం!" అంటూ బాధపడ్డాడట.



ఫ్రాన్స్‌కు చెందిన రాజకీయ నాయకుడు ఒకరు చనిపోయే ముందు సుమధురమైన సంగీతం వింటూ చిరనిద్ర పోయేటట్లు చూడండి అన్నాడట.

ఇకపోతే విశ్వవిజేత అయిన అలెగ్జాండర్ "నా మరణానంతరం శవపేటికలో, నా శరీరాన్ని వుంచి, రెండు చేతులనూ బయట వుంచండి, ఎందుకంటారా? విశ్వవిజేతనైన నేను, ఈ ప్రపంచంనుండి ఉత్తచేతులతో పోతున్నట్లు ప్రజలు చూడాలి" అన్నాడు.

ప్రముఖ రచయిత వోల్టేర్ కొన ఊపిరితోనున్నపుడు 'ప్రశాంతంగా చావనివ్వండి' అన్నాడు.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, చనిపోయేముందు చేయి ఎత్తివేళ్ళతో ఏవో కొన్ని రేఖలు గీస్తూ "ఏమౌతుందో నాకు తెలియదు, కాని జరిగేదంతా మంచికే!" అన్నాడు.

జర్మనీకి చెందినటువంటి మహాకవి గేటే, 'వెలుగు, వెలుగు' అంటూ కన్నుమూశాడు.

"నేను మహాత్మాగాంధీ ఎక్కడికి వెళ్ళారో అక్కడికి పోవాలనుకున్నాను, ఎందుకంటారా? అక్కడ సుఖ దు ఖాలు లేవు" అన్నాడు ప్రముఖ పండితుడు, న్యాయవాది, సర్ తేజ్ బహదూర్ సప్రూ.

ప్రముఖ నాటకకర్త లేవో ఉరికంబంముందు "నిన్న రాత్రి నేను ప్రదర్శించిన నాటకం గురించి, పత్రికల్లో సమీక్షలు వస్తాయో లేదో?" అన్నాడు.

గాంధీజీ నాథూరామ్ గాడ్సే తుపాకి గుళ్ళకు బలి అయినప్పుడు, "హేరామ్" అన్నాడని కొందరు, "రామ్,రామ్" అన్నాడని మరికొందరు, "ఆ" అన్నాడని, ఆయనను కాల్చిన నాథూరామ్ గాడ్సే అన్నాడు

డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

# శ్రీనాథుడు



నేటి భారతీయ వాఙ్మయంలో ఆంధ్ర వాఙ్మయం, ఒక ఉత్తమ వాఙ్మయంగా పరిగణింపబడుటకు, కవిత్రయం తరువాత చెప్పుకోవలసిన కవి కుల గురువు శ్రీనాథుడు.

తెలుగు సాహితీ చరిత్రలో నన్నయ యుగం తరువాత చెప్పుకోవల్సింది శ్రీనాథుని యుగము.

క్రీ.శ. 1380 ప్రాంతంలో జన్మించి క్రీ.శ. 1440వ ప్రాంతంలో మరణించినట్లు చారిత్రక ఆధారాలు కన్పిస్తున్నాయి.

శ్రీనాథుని యుగంలో తెలుగు వాఙ్మయమనెడి ప్రవాహం వివిధ మార్గాలుగా ప్రవహించింది.

కొండవీటి పెదకోమటి వేమారెడ్డి (1404-1420) ఆస్థానంలో విద్యాధికారిగా శ్రీనాథుడు పనిచేశారు. ఆరాజవంశం అంతరించిన తరువాత రాజమండ్రి రెడ్డిరాజుల కొలువులో చేరాడు.

శ్రీనాథుడు కాశీఖండం, భీమఖండం, శృంగారనైషథం, హర విలాసం, మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పల్నాటి వీర చరిత్ర, శివరాత్రి మహాత్యం మొదలైన అమూల్యమైన గ్రాంథాలను రచించారు.

శ్రీనాథుని సీస పద్యాల సొంపు తెలుగు నుడికారపు ఇంపు అనుభవిస్తే గాని అర్థంగాదు. శ్రీనాథుడంటేనే శృంగర రసం గుర్తొస్తుంది. ఇతని చాటువులు శృంగార రసానికి బంగారు పేటికలు.

శ్రీనాథునితోనే కథా ప్రాధానేయం తగ్గిపోయి రస ప్రాధన్యత జతకట్టింది. శృంగార నైషథం, హర విలాసం, క్రీడాభిరామం ఇట్టి రచనలే. ఒకే విషయాన్ని పెక్కు తీరుల సాగదీసి చెప్పే ధోరణులకు శ్రీనాథుడే శ్రీకారం చుట్టాడు. ఆ తరువాత కాలంలో పెద్దనాదులు అనుసరించారు. అధునిక కవులలో ప్రజాకవి జాషువ కూడా ఇదే పద్ధతిని అనుసరించాడు.

తెలుగులో వీరగాథాకావ్యం వ్రాసిన మొదటి కవి శ్రీనాథుడు. వస్తువులో నవ్యతను జోడిస్తూ వ్రాసిన వీరగాథా కావ్యమే పల్నాటి వీర చరిత్ర.

ఆంధ్ర సారస్వతంలో ప్రకృతి వర్ణనకు పెద్ద పీట వేసిన మహానుభావుడు శ్రీనాథుడు. భీమఖండంలో గోదావరి తీర కేదార సీమల, కదళీవనాలు, పుండ్రేక్షు భూములు, కాశీ ఖండంలో మధ్య ఆంధ్రదేశ వర్ణన, ద్రాక్షారామ వనవాటిక వర్ణన వర్ణనాతీతం.

సమకాలీన సమాజ జీవితాన్ని చిత్రించటంలో• శ్రీనాథుడు ఎంతో నవ్యత కనబరిచాడు.

క్రీడభిరామం వినుకొండ వల్లభరాముడుచే వ్రాయబడినదని గ్రంథంలో వున్నా దానిలోని ప్రతి అక్షరంలో శ్రీనాథుడి శైలి తొంగిచూస్తుంది. శ్రీనాథుడే వ్రాసి ఆ ప్రభువు పేరు వ్రాసి వుంటాడని చారిత్రికుల అభిప్రాయం. ఈ క్రీడాభిరామానికి మూలం సంస్కృతంలో గల ప్రమాభిరామం. ఈ పుస్తకంలో శ్రీనాథుడు సమకాలీన సమాజ చిత్రణ సభూతో నభవిష్యతి. ఈ పుస్తకంలో ఓరుగల్లు సాంఘిక జీవనాన్ని కాకతీయుల నాటి కులాలు, వర్ణాలు, వృత్తులు, క్రీడా వినోదాలు, పూటకూళ్ళ భోజనాలు, ఆనాటి ప్రజల ఆచార వ్యవహారాలు అద్భుతంగా వర్ణించబడినవి. మంచన శర్మ పాత్ర ద్వారా ఆనాటి వేశ్యాలోలత్వాన్ని విశదపరిచాడు.

డిండిమభట్టులాంటి ఉద్దండ సంస్కృత పండితులతో తలపడి వాద పటిమతో ఓటమిపాలు జేసిన జగజెట్టి మహాగట్టి శ్రీనాథసార్వభౌముడు. తెలుగు భాషకు పట్టంకట్టి పలుభాషలలో తెలుగుభాష లెస్స అనిపించి, చాటువుల ద్వారా తెలుగు కవిత్వాన్ని పండితులకే గాక, పామరులకు కూడా రుచిమాపించిన యుగకర్త శ్రీనాథుడు.

•••


## దర్పణం లో ప్రకటన రేట్లు

| | | | |
|---|---|---|---|
| బ్యాక్ కవర్ (ఫుల్ పేజి కలర్) | రూ॥ 3,000/- | బ్యాక్ కవర్ (ఇన్ సైడ్ కలర్) | రూ॥ 2,000/- |
| ఇన్ సైడ్ కవర్ పేజి కలర్ | రూ॥ 2,000/- | బ్లాక్ & వైట్ ఫుల్ పేజి | రూ॥ 1,000/- |
| బ్లాక్ & వైట్ హాఫ్ పేజి | రూ॥ 600/- | బ్లాక్ & వైట్ పావు పేజి | రూ॥ 350/- |

- **ప్రకటన సంబంధిత వివరాలు మాకు ప్రతి నెల 20వ తేది లోపు చేరాలి.**
- **చెక్కులు/డ్రాఫ్టులు 'The Bombay Andhra Mahasabha & Gymkhana' పేరుమీద తీయాలి.**
- **సభ్యుల ప్రకటనలకు 10%(Discount) రిబేటు ఇవ్వబడును**

**మూడు నెలలకై, ఆరునెలలకై, సంవత్సరానికై ఒకే సారి ఆర్డర్ ఇచ్చు వారికి ధరలలో రాయితీలు ఇవ్వబడును. వివరాలకు సంప్రదించండి. ఫోన్ నం. 24144377/88.**

# పరుగు



చిన్నారులకు త్వరగా నడవాలని – పరుగు
విద్యార్థులకు పరీక్షలు ముగియాలని – పరుగు
చిరుద్యోగికి 1 వ తారీఖు కోసం – పరుగు
సంసారికి బాధ్యతలు తీరాలని – పరుగు
బిచ్చగానికి ఆకలి మంటలు ఆరాలని – పరుగు
రాజకీయ నాయకులకు పదవులకోసం – పరుగు
మఠాధి పతులకు తమమతాన్ని పెంచుకోవాలని – పరుగు
శాస్త్రవేత్తలకు ఏదో ఆవిష్కరించాలని – పరుగు
వ్యాపారికి లాభాలకోసం – పరుగు
భక్తునికి మోక్షం కావాలని – పరుగు
ప్రతి మనిషీ చేసే ఈ పరుగు పందానికి
అంతం ఎప్పుడు ?
అంతం ఏది ?
అంతం ఎక్కడ ?

శ్రీమతి పొన్నూరి భారతలక్ష్మి

## మీకు తెలుసా!




ఓ. మనిషి ఏడాదికి 16000 గ్యాలన్ల నీటిని తాగుతాడు.



తేనేటీగ సెకనుకు 200 సార్లు రెక్కల్ని ఆడిస్తుంది.

సముద్రాలన్నింటిలో కలిపి సుమారు 20 మిలియన్ టన్నుల బంగారం ఉంటుందని అంచనా.



## సభ్యులకు మనవి

- మీ చిరునామా గానీ, ఫోన్ నెంబర్ గానీ మారితే రాసి పంపండి.
- కవితలు, జోక్స్, వింతలు విశేషాలు, చిన్న కథలు ఇట్లాంటివి రాసి పంపండి.
- సభ్యులు ఏదైనా సామాజిక, సాంస్కృతిక, సాహితీ, క్రీడా, విద్యాలాంటిరంగాల్లో ఏదేని అవార్డు రివార్డు పొందినట్లయితే మాకు తెలుపండి .. ప్రచురిస్తాం.
- రచనలు తమ స్వంతమని హామీ పత్రం జతచేయండి. ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలకు, వాద వివాదాలకు తావు లేదు.
- పెండ్లి రోజులు, పుట్టిన రోజుల వివరాలు తెలుపండి.

# నిద్రపట్టడం లేదా?



పిల్లలనుంచి పెద్దలవరకూ అనేకమంది ఎదుర్కొనే సమస్య రాత్రిపూట మంచి నిద్రపట్టకపోవడం, జీవన విధానం, ఆహారపు అలవాట్లు ఒత్తిడి స్థాయిలు, వాతావరణం, నిద్రలేమికి కారణమవుతాయి. మంచి నిద్రకు ప్రధాన కారకం మెదడు. కాబట్టి మెదడు ప్రశాంతంగా ఉండాలి. సెరోటనిన్, మెలటోనిన్ వంటి న్యూరో ట్రాన్స్ మీటర్లు మెదడు రిలాక్సవడానికి సహకరించి, సుఖ నిద్రకు తోడ్పడతాయి. వీటికి అవసర మయిన పదార్థం ట్రిప్టోఫాన్ నుంచి అంది అది ఎల్–ట్రిప్టోఫాన్ అనే ఎమినో యాసిడ్‌గా మారుతుంది. కార్బొహైడ్రేట్స్, ట్రిప్టోఫాన్ ఎక్కువగా వుండే ఆహారం తినడం వల్ల ఎమినో యాసిడ్లు రక్తానికి, మెదడుకు మరింతగా అందుతాయి.

అరటిపండ్లలో మెగ్నీషియం అధికంగా వుంటుంది. ఇది కండరాల్ని రిలాక్స్ చేస్తుంది. బాదం పప్పులలో ట్రిప్టోఫాన్, మెగ్నీషియం అధికంగా వుంటాయి. అవిసె గింజలలో ఒమెగా–త్రీ, ఫోనోటీయాసిడ్లు ఎక్కువగా వుండి మంచి మూడ్‌ను, విశ్రాంతిని ఇస్తాయి. బంగాళాదుంపలు, పుట్టగొడుగులలో ట్రిప్టోఫాన్ అధికంగా వుంటుంది. అన్నం, ఓట్స్, పప్పులలో నిద్రకు సహకరించే లక్షణాలు ఎక్కువ.

నిద్రపోయేముందు తీపి పదార్థాలు అసలు తినకూడదు. తేనె, కాటేజ్ ఛీజ్, పాలు, సోయాపాలు, టోఫు, సోయాబీన్స్ ట్రిప్టోఫాన్‌కు మంచి ఆధారం. ఇవన్నీ బాగా నిద్రపోవడానికి సహకరించేవే. నిద్ర పట్టడంలేదంటూ బాధపడే బదులు ఈ పదార్థాలకు కొంత పనిపెడితే అంతా సరవుతుంది.

- తన కోసం తాను జీవించేవాడు మనిషి, ఇతరులకోసం జీవించే వాడు మహర్షి.
- ద్వేషించడం కన్న ప్రేమించడం మిన్న.
- మూర్ఖుడి నవ్వుకంటే, స్నేహితుడు కోపం నయం


# Photo Gallery














శ్రీ గణేశాయ నమః

# శ్రీ వేంకటేశ్వరా పూజా మందిర ట్రస్టు (రిజిష్టర్డు)

## ది బొంబాయి ఆంధ్ర మహా సభ & జింఖానా

లఖంసీ నపూ రోడ్, హిందూ కాలనీ, దాదర్ (తూర్పు), ముంబయి - 14
ఫోన్ - 022-2414 4377/ 2414 4388

శ్రీరస్తు శుభమస్తు నిర్విఘ్నమస్తు

"శ్రియ కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీ వెంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్"

స్వస్తి శ్రీ చాంద్రమాన విరోధి నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ
సప్తమి కృత్తికా నక్షత్రయుక్త శుభ సమయమందు

**తేది 21-02-2010 ఆదివారం ఉదయం 09.30 ని. ల నుండి**



శ్రీరమా సమేత

# శ్రీ సత్యనారాయణ వ్రతము



సాముహికముగా, వైభవోపేతముగా జరుప నిశ్చయించినాము. కావున సేవ చేయించ కోరు భక్తులు వ్రతము మరియు సహస్రనామార్చనకు రూ. 501/- మరియు కేవలము సహస్రనామార్చనకు రూ. 116/- రూపాయలు మహాసభ కార్యాలయంలో 18-02-2010 లోపుగా చెల్లించి మీ గోత్రనామములు వ్రాయించుకొన మనవి. భక్తులు అత్యధిక సంఖ్యలో విచ్చేసి సేవలలో పాల్గొని తీర్థ ప్రసాదములు, భోజనములు స్వీకరించి తరించ ప్రార్థన.

**పై సేవల నిమిత్తము భక్తులు విరివిగా విరాళములీయ పార్థన**

మంగళమ్ మహత్
శ్రీ శ్రీ శ్రీ

అధ్యక్షులు
శ్రీ అద్దంకి వెంకటేశ్వర రావు
98692 56486

కార్యదర్శి
శ్రీ తురగా రవీంద్ర
98201 29385

## శాశ్వత పూజలు నిర్వహించే సభ్యులకు వినతి

అడ్రసు, టెలిఫోన్ నెంబర్లు, ఇ-మెల్ అడ్రస్ శాశ్వత పూజలు నిర్వహించే తేదీలలో మార్పులు ఉన్నయెడల వెంటనే ఈ కింది చిరునామకు తెలియగోరుచున్నాము.

## ది బొంబాయి ఆంధ్రమహాసభ & జింఖానా

లఖంసి నపూ రోడ్, హిందూ కాలనీ, దాదర్ (తూర్పు), ముంబయి - 14